కష్టపడి.. టీచర్లయ్యారు!
డీఎస్సీ కొట్టిన రోడ్ రోలర్ డ్రైవర్.. తాపీమేస్త్రి 6




**పవన్ జన్మదిన వేడుకలు**

డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు జిల్లా అంతటా పెద్దఎత్తున జరిగాయి. ప్రతి నియోజకవర్గంలో కూటమి శ్రేణులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రామచంద్రపురం జనసేన పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి సుభాష్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్. -ద్రాక్షారామ

## 'అందరికీ ఇళ్లు' కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి : జేసీ

అమలాపురం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటివరకు ప్రభుత్వ నివేశన స్థలం పొందని అర్హులకు 'అందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జేసీ పాల్గొన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల్లో జిల్లా కోర్టుల నిర్మాణం నిమిత్తం స్థలాల సేకరణ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, కుల ధ్రువీకరణ విచారణ తదితర అంశాలపై జయలక్ష్మి సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం జేసీ మాట్లాడుతూ అర్హులందరికీ పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలన్నారు. ప్రజా సంతృప్తే కొలమానంగా అర్జీలను పరిష్కరించాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, మొదటి విడత నిధులు పొందేలా అర్హులందరినీ జాయింట్ ఎల్పీఎంగా విభజించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కొత్తమాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

# అలా వెళ్లొచ్చేద్దాం!



రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వాడపల్లి వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉన్న దృశ్యం

- ఉచిత బస్సులకు జిల్లాలో అనూహ్య స్పందన
- 10.63 లక్షల మంది మహిళల ప్రయాణం
- అత్యధికంగా రావులపాలెం డిపో నుంచి 3.23 లక్షల మంది ప్రయాణాలు
- కొనసాగుతున్న స్త్రీశక్తి పథకం సంబరాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎప్పుడోగానీ ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టని మహిళలు సైతం ఇప్పుడు ఉచిత బస్సు పుణ్యమా అని ఏదొక పని నిమిత్తం బస్సు ఎక్కి ప్రయాణాలు చేసేస్తున్నారు. ఏ బస్టాండ్ వద్ద చూసినా వారిదే సందడి. సూపర్-6 హామీల అమలులో భాగంగా స్త్రీశక్తి పథకం కింద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. బలహీన వర్గాలకు చెందినవారు, నిరుపేదలు కుటుంబ సమేతంగా ఆర్టీసీపై రవాణా సాగించాలంటే ఆర్థికపరమైన ఇబ్బందులు ఉత్పన్నమయ్యేవి. ఇప్పుడు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రయాణిస్తున్నారు. దీంతో మహిళలకు ఆర్థికంగా చాలా ప్రయోజనం కలిగింది. ఉచిత బస్సు సౌకర్యంతో బస్సుతో మహిళలు పెద్దఎత్తున నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఏ బస్టాండులో చూసినా మహిళలతో నిండిపోతోంది. జిల్లా పరిధిలో నాలుగు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. గత నెల 15వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సుమారు 15 రోజులపాటు జిల్లాలో 10.63 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉచిత బస్సుల ద్వారా గమ్యస్థానాలకు చేరుకున్నారు. వీటిలో అత్యధికంగా రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి 3,23,779 మంది ప్రయాణించి ప్రథమస్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో రామచంద్రపురం డిపో నుంచి 3,15,670 మంది, తృతీయ స్థానంలో అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి 2,62,323 మంది మహిళలు ప్రయాణించారు. ఇక నాల్గో స్థానంలో 1,62,101 మంది రాజోలు డిపో నుంచి మహిళలు ప్రయాణించారు. జిల్లాలో మహిళలు ముఖ్యంగా కుటుంబ సమేతంగా ఆలయాల సందర్శన, వివిధ వేడుకలకు పిల్లాపాపలతో హాజరవుతున్నారు. స్త్రీశక్తి పథకం కింద సూపర్ ఎక్స్‌ప్రెస్, ఆల్ట్రాడీలక్స్, పల్లెవెలుగు బస్సులు నడుపుతుండడంతో ఆ బస్సుల్లో మగవారికి సీటు దక్కాలంటే కుస్తీ పట్లు పట్టాల్సిందే. 15 రోజుల వ్యవధిలో జిల్లాలో రికార్డు స్థాయిలో మహిళలు ప్రయాణించడంతో కూటమి శ్రేణులు విజయోత్సవ సంబరాలు చేస్తున్నారు. ఇక జిల్లా ప్రాంతీయ రవాణాధికారి ఎన్టీపీ రాఘవకుమార్‌ను స్త్రీశక్తి పథకం గురించి ప్రశ్నిస్తే.. ఉచిత ప్రయాణాలు రికార్డు స్థాయిలో సాగుతున్నాయని, మహిళలు కూడా ఆర్టీసీ సిబ్బందికి సహకరిస్తున్నారని, సిబ్బంది కూడా క్రమశిక్షణతో మెలగుతున్నారని ఆయన చెప్పారు.



ఎన్టీపీ రాఘవకుమార్

### రావులపాలెం డిపోకు పెరిగిన ఒత్తిడి

రావులపాలెం,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): రావులపాలెం బస్ డిపోకు ఉచిత బస్సు ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. నాలుగైదు జిల్లాలకు వెళ్లేందుకు ఈ బస్ కాంప్లెక్స్ ప్రధాన కూడలి కావడంతో ఆ మేరకు రద్దీ ఏర్పడుతోంది. రాష్ట్రంలో చాలా డిపోల నుంచి వాడపల్లి పుణ్యక్షేత్రానికి శనివారం ప్రత్యేక బస్సులు ఉంటాయి. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడంతో మహిళలు పెద్దఎత్తున ఇక్కడకు తరలివస్తున్నారు. దానికి అనుగుణంగా బస్సులను నడపాల్సిందిపోగా కొన్ని డిపోల్లో బస్సు సర్వీసులను తగ్గించడంతో ఈ ఒత్తిడి రావులపాలెం డిపోపై అధికంగా పడింది. గతంలో రావులపాలెం డిపో నుంచి ఆరు బస్సులను నడుపుతుండగా ప్రస్తుతం రద్దీ దృష్ట్యా ఆర్టీసీ డీఎం కుమార్ ప్రతి శనివారం 14 బస్సులను వాడపల్లికి నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. స్త్రీ శక్తి పథకం అమలుకు ముందు రాష్ట్రంలోని 29 డిపోల నుంచి 119 బస్సులు వాడపల్లి క్షేత్రానికి తిరిగేవి. స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక 27 డిపోల నుంచి 83 బస్సులు మాత్రమే వాడపల్లి తిరుగుతున్నాయి. గతంలో 119 బస్సులు 380 ట్రిప్పులు వేయగా ప్రస్తుతం 300 ట్రిప్పులు తిరుగుతున్నాయి. వీటిలో రావులపాలెం డిపో బస్సులే 200 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ఇతర డిపోల నుంచి బస్సులు తగ్గించేయడంతో విపరీతమైన ఒత్తిడి రావులపాలెం డిపోకి పెరిగింది.



పరిశ్రమల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## పర్యావరణ, కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించాలి : కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రొయ్యల ఫ్యాక్టరీలు నిర్వహిస్తున్న యాజమాన్యాలు తప్పనిసరిగా అన్ని అనుమతులు పొందడంతోపాటు పర్యావరణ, కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రొయ్యల పరిశ్రమల పర్యవేక్షణ తనిఖీ కమిటీ సభ్యులను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. పర్యవేక్షణ తనిఖీ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో జీవో నంబరు 123ను విడుదల చేసిందన్నారు. మరో ఐదు శాఖల అధికారులతో కలిసి కమిటీ అధ్యక్షుడిగా కలెక్టర్‌ను నియమించారు. నోడల్ అధికారిగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, సభ్యులుగా జీఎం డీఏసీ, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, జాయింట్ కమిషనర్ ఆఫ్‌లేబర్, ఎంపెడా అధికారులు డీఎంహెచ్‌వో ఉంటారని వివరించారు. నిబంధనల ప్రకారం కనీస వేతనాలు అమలుచేస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు వేస్ట్ వాటర్, వ్యర్థాల నిర్వహణ చేపడుతున్నదీ లేనిదీ ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఫ్యాక్టరీల్లో పరిశుభ్రత విధిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ టి.నాగలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి జీవీ శ్రీనివాస్‌లు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు పాల్గొన్నారు.

### పేరూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు

తక్కువ ఖర్చుతో ఉన్నత విద్య అందించేందుకు పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తాత్కాలికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు అంశంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు డిమాండ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఆలమూరు కళాశాలను ఇక్కడకు బదలాయించడం జరిగిందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులను ప్రవేశ పెడుతున్నట్టు చెప్పారు. ప్రవేశాలు పొందే విద్యార్థులు సెల్ 9491191635ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీఆర్వో కె.మాధవి, ప్రిన్సిపాల్ వి.నరసింహస్వామి, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.



# భూ..తాలు!

## ఫ్యాన్ కేటాయింపు.. అక్రమాల కంపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వశాఖలకు ఉచితంగా కేటాయించిన భూములు చాలా వరకు పరాధీనమయ్యాయి. కేటాయించిన అవసరాలకు బదులు పలువురు నేతల కబ్జాల్లోకి వెళ్లిపోయాయి. పేరుకు బయటకు ప్రభుత్వ శాఖల అవసరాలకు ఉచితంగా కేటాయిస్తే వాటిని అనేకచోట్ల చెరబట్టి దారి మళ్లించేశారు.గత వైసీపీ సర్కారు హయాంలో అలియ నేషన్ పేరిట విలువైన ప్రభుత్వ భూములు వివిధ శాఖల అవసరాలకు ఉచితంగా కేటాయించగా,వాటిలో చాలా వరకు ఆపార్టీ నేతలే వాలిపోయి ఎంచక్కా అనుభవిస్తున్నారు. లీజులకు ఇచ్చేసి అడ్డగోలుగా జేబులు నింపేసుకుంటున్నారు. సబ్‌స్టేషన్లు, స్కూళ్లు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, బల్క్‌మిల్క్ సెంటర్లకు ఇచ్చిన స్థలాల్లోను పాగా వేసేశారు. ఈ తరహా కబ్జాలపై ప్రభుత్వం తాజాగా దృష్టిసారించింది. ఇంతవరకు ఎన్ని భూములు ఇలా కేటాయించరనేదానిపై నివేదికలు రప్పిస్తోంది. గడచిన ఐదేళ్లలో 5,700 ఎకరాల వరకు కేటాయించినట్టు ప్రభుత్వానికి నివేదికలు సిద్ధం చేశారు.

### విలువైన భూములు ఉచితంగానే..

రెవెన్యూశాఖ ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో కోట్ల విలువైన వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. వీటిని ప్రభుత్వాలు రకరకాల అవసరాల పేరుతో వినియోగించుకుంటున్నాయి. ఇతర ప్రభుత్వ శాఖలకు కావాలంటే రెవెన్యూ శాఖ నుంచి ఉచితంగా అలియనేషన్ కింద ప్రభుత్వం కేటాయిస్తూ వస్తోంది. కొన్ని కంపెనీలకు కావాలంటే ధర నిర్ణయించి వసూలు చేసి వాటికి కేటాయిస్తున్నాయి. ఇలా అలియనేషన్ కింద వివిధ ప్రభుత్వశాఖలకు ఉచితంగా కేటాయిస్తోన్న భూములు కాలక్రమేణా కబ్జాలకు గురవుతున్నాయి. కొందరు పలుకుబడి కలిగిన నేతలైతే ప్రభుత్వ శాఖల పేరుతో భూములు ఉచితంగా కొట్టేసి ఆనక వాటిలో పాగా వేసేస్తున్నారు. వీటిని వ్యాపార అవసరాలకు కేటాయించడం, సొంత వ్యాపారాలకు గోదాములు నిర్మించడం వరకు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి.



అప్పట్లో జగన్ సర్కారు కొత్తగా తెచ్చిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్, చిల్లింగ్ కేంద్రాలకు ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అలియనేషన్ విధానంలో ఉచితంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీశాఖ, పశుసంవర్ధకశాఖలకు కేటాయించేశారు. కాలువల వెంబడి భూములను ఎడాపెడా ఇచ్చిపారేశారు.వీటిని కేటాయించిన అవసరాలకు కాకుండా ఆ ముసుగులో కొందరు వైసీపీ నేతలు మూడు జిల్లాల్లో పలుచోట్ల వాటిలో పాగా వేసేసి సొంత అవసరాలకు వాడుకుంటు న్నారు.దీంతో ప్రస్తుత ప్రభుత్వం వీటిపై కన్నేసింది. గత ఐదేళ్లలో ఏయే శాఖలకు వీటిని ఎంతెంత విస్తీర్ణంలో కేటాయించారు? వాటిలో అసలు ఎవరుంటున్నారు? ఆయా శాఖల అవ సరాలకు నిజంగానే వీటిని వాడుతున్నారా? లేదా? అనేదానిపై పూర్తిస్థాయిలో నివేదికలు పంపాలని కోరింది. మండలాల వారీగా ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు ఏయేశాఖలకు కేటాయించారో లోతుగా వివరాలు పంపాలని ఆదేశించింది. జిల్లాల వారీగా రెవెన్యూశాఖ ఈ వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేసింది.

### 5700 ఎకరాల మాటేమిటి..

కాకినాడ జిల్లాలో రెవెన్యూ శాఖకు చెందిన వేల కోట్ల విలువైన 4,601 ఎకరాల భూములను వివిధ శాఖల అవసరాలకు ఇప్పటి వరకు ఉచితంగా కేటాయించినట్టు నివేదికలో తేల్చారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అత్యధికం. ఇందులో కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 1,903 ఎకరాలు, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 2,697 ఎకరాలను ఉచితంగా కేటాయించారు. ఒక్క కాకినాడ రూరల్ మండలంలోనే వేల కోట్ల విలువైన 1,483 ఎకరాలు భూములను వివిధ ప్రభుత్వ శాఖల అవసరాల ముసుగులో ఉచితంగా కేటాయించేశారు. వీటిలో ఎక్కువగా గత వైసీపీ హయాంలో కేటాయించినవే ఉన్నాయి. ప్రభుత్వశాఖలకు కేటాయించిన ఈ భూములను కొందరు వైసీపీ నేతలు తమ పలుకుబడితో కబ్జా చేసేసి సొంతంగా వాడుకుంటున్నారు. కొందరైతే ఏకంగా ప్రైవేటుగా గోదాములు నిర్మించి అద్దెలకు ఇచ్చేసుకున్నారు. మరికొందరు లీజులకు ఇచ్చేశారు. కానీ భూమి పొందిన ప్రభుత్వ శాఖలు మాత్రం కిమ్మనడం లేదు. తొండంగి మండలంలో 2,405ఎకరాల్లో సగానికి పైగా కాకినాడ సెజ్‌కు కేటాయించారు. మరికొంత పోలవరం కాలువ, సబ్‌స్టేషన్లకు కేటాయించారు. వీటిలోను అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కోనసీమ జిల్లాలో గడచిన ఐదేళ్లలో 479 ఎకరాల వరకు కేటాయించారు. ఇందులో జల వనరులు, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, పంచాయతీశాఖలకే అధికంగా ఉన్నాయి. వీటిలోను అనేక చోట్ల ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. పలుచోట్ల చెరువులు, కోళ్లఫారాలు, షెడ్లు నిర్మించేసి వాడేసుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి నియోజకవర్గాల్లో కేటాయింపులు జరగ్గా, వీటిలోను అనేకచోట్ల ఆయా శాఖలకు కేటాయించిన భూములపై నిఘాలేక ఇతరత్రా అవసరాలకు మళ్లిపోయినట్టు గుర్తించారు. తాజాగా ఉన్నతాధికారులు ఈ మేరకు భూకేటాయింపుల వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు.

- ప్రభుత్వ భూమి.. ప్రైవేటు లొసుగు
- భూకేటాయింపుల్లో అక్రమాలెన్నో
- గత ప్రభుత్వంలో విచ్చలవిడితనం
- 5,700 ఎకరాలు పరాధీనం
- భూముల్లో వైసీపీ నేతల పాగా
- దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం
- జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం
- అనేక చోట్ల అడ్డగోలు వ్యాపారాలు
- కాకినాడ జిల్లాలో 4,601
- కోనసీమ, తూర్పున 1,100

# నెలంతా.. రేషన్!



- 15రోజుల కాలపరిమితి ఎత్తివేత
- 365 రోజులు రేషన్ దుకాణాలు
- 17 లక్షల కార్డుదారులు
- ఉమ్మడి జిల్లాలో అమలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు శుభవార్త. ఇక నుంచి ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు నెలంతా తెరిచే విధంగా పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేయనుంది. ఇప్పటికే దీనిపై ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ క్లారిటీ ఇచ్చేశారు. ఇకపై నెలంతా రేషన్ ఇచ్చే విధంగా ఆదేశాలు ఇస్తున్నామని మంత్రి ప్రకటించారు. దీంతో లబ్ధిదారుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 17 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరూ ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ డిపోల నుంచి సరుకులు తీసుకుంటున్నారు. అయితే వివిధ పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన కూలీలు, సామాన్యులు ఒక్కొక్క పర్యాయం అనుకున్న సమయానికి రేషన్ తీసుకోలేకపోతున్నారు. అలా తీసుకోని నెలలో బియ్యం, పంచదార వంటి నిత్యావసర వస్తువులు వదులుకోవాల్సి వస్తోంది. తాజాగా పౌరసరఫరాలశాఖ మంత్రి ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లువిరిస్తోంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ ఇవ్వడం వల్ల కేవలం 90 శాతం కార్డుదారులకు మాత్రమే రేషన్ సరఫరా అవుతుంది. ప్రధానంగా నగరాల్లో, పట్టణాల్లో అయితే పోర్టబులిటీ విధానం వల్ల ప్రతి నెల పదో తేదీ వచ్చే సరికే పలు దుకాణాల్లో బియ్యం నిండు కుంటు న్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికుల కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర పట్టణాల్లో ప్రతి నెల పదో తేదీకే 50 శాతం రేషన్ దుకాణాల్లో బియ్యం నిండుకుం టున్నాయి. దీనివల్ల బియ్యాన్ని పేదలు పొందలేకపోతున్నారు. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కాలంటే నెలంతా రేషన్ పంపిణీ ద్వారా సాధ్యపడుతుంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు రేషన్ పంపిణీ చేయడం వల్ల ఏదైనా వీలున్న సమయంలో సరుకులు తెచ్చుకునే సౌలభ్యం లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో ఉన్న రెండువేల రేషన్ దుకాణాలు ఇక నుంచి నెలంతా ఓపెన్ చేసే ఉంటాయి. పేదలకు సరుకులు పంపిణీ చేస్తూనే ఉంటాయి.

### త్వరలో మరిన్ని సరుకులు

ఇక నుంచి రెగ్యులర్‌గా ప్రతినెల కందిపప్పు, నూనె, రాగులు, గోధుమపిండి రేషన్ కార్డుదారులకు ఇస్తామని మంత్రి ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి వినియోగం ఎక్కువ. దీంతో కార్డుదారులు స్వాగతిస్తున్నారు.

### ఉత్తర్వులకు ఎదురుచూపులు..

దీనిపై ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని కాకినాడ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు తెలిపారు. ఉత్తర్వులు వచ్చిన తర్వాత దానిలో పేర్కొన్న విధంగా జిల్లాలో రేషన్ దుకాణాలు తెరిచి ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు రేషన్ దుకాణాల ద్వారా సమర్థంగా, నిత్యావసరాలు సకాలంలో అందజేస్తామన్నారు.

# సొమ్ము ప్రజలది.. సోకు పంచాయతీది

- ద్వారపూడి పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో అడుగడుగునా లోపాలే
- నిబంధనలకు పాతర.. కొనసాగుతున్న డీఎల్‌డీవో విచారణ
- ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక

మండపేట, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడి గ్రామ పంచాయతీలో ప్రజాధనంతో నిర్మించిన పంచాయతీ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణంలో అడుగడుగునా ప్రభుత్వ నిబంధనలకు పాతర వేశారు. ఈ వ్యవహారంలో తవ్వినకొద్దీ అవినీతి మరకలు బయటపడుతున్నాయి. 'ఆంధ్రజ్యోతి' మంగళవారం సంచికలో 'అక్రమాలపై చర్యలేవీ' శీర్షికన కథనం రావడంతో ఈ అవినీతి వ్యవహారంతో సంబంధం ఉన్న వారి గుండెల్లో రైళ్లు పరుగెట్టాయి. మంగళవారం నాడు జరిగిన విచారణకు పంచాయతీ పాలకవర్గం వారు హాజరై జమాఖర్చులు సమర్పించేందుకు తమకు కొంత గడువు కావాలని కోరినట్టు సమాచారం. 2022లో పంచాయతీ బైలా తీర్మానం మేరకు ద్వారపూడిలో పంచాయతీకి చెందిన స్థలంలో 39 దుకాణాల సముదాయం నిర్మాణానికి కలెక్టర్, డీపీవో అనుమతులు మంజూరు చేశారు. జిల్లా అధికారుల అనుమతులను అసరాగా చేసుకుని ఎటువంటి టెక్నికల్ అనుమతులు లేకుండా కనీసం అధికారులు పర్యవేక్షణ లేకుండా, పనులకు సంబంధించి కనీసం టెండరు పిలవకపోగా, ఇష్టానుసారంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేసేశారు. వాటికి సంబంధించి కనీసం మండల ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేదు. అయినాగానీ అప్పట్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులతోపాటు ఎంపీడీవో, ఇవోపీఆర్‌డీలు సహకరించడం విశేషం. ఎటువంటి అనుభవం లేకుండా రూ2.35 కోట్ల మేర పనులు సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఎలా పనిచేస్తారనే ఆలోచన లేకుండా పాలకవర్గానికి అధికారులు ఎలా వంత పాడారనే వాదన వినిపిస్తోంది. మరోవైపు డీపీవో సైతం గతంలో విచారణ చేసినప్పుడు పంచాయతీ కార్యదర్శులు, డీఎల్‌పీవో, ఎంపీడీవో పాత్రపై ఎక్కడ ప్రస్తావించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రెండు కోట్లకు పైబడిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టే అర్హత వారికి ఉందా? లేదా అనేది ప్రస్తావించకుండా కేవలం బైలా ఆధారంగానే విచారణ నిర్వహించి మమ అనిపించారు. అది కూడా కేవలం సర్పంచ్ చెక్‌పవర్ రద్దుచేశారే తప్ప ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులపై ఎటువంటి చర్యలు ఇప్పటివరకు తీసుకోలేదు. ఒక పంచాయతీలో ప్రజాధనంతో జరిగే పనులను కనీసం మండల స్థాయి అధికారి పర్యవేక్షణ, టెక్నికల్ అనుమతులు లేకపోగా టెండరు కూడా పిలవకుండానే సొంతంగా నాణ్యతాప్రమాణాలు పాటించకుండా దుకాణ సముదాయం నిర్మించడం వంటి అంశాలు చర్చనీయాంశం అయ్యాయి. ఇప్పటికే ఈ దుకాణ సముదాయ నిర్మాణంలో అవినీతి జరిగిందని అధికారుల విచారణలో వెలుగుచూసింది. ఇప్పటికే పలు దఫాలుగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌డీవో వానపల్లి విజయలక్ష్మి ద్వారపూడి పంచాయతీలో ఈ వ్యవహారంపై విచారణ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు కేవలం పంచాయతీ పాలకవర్గం రూ.1.40కోట్లకు మాత్రమే లెక్కలు చెప్పగా, మిగిలిన నిధులకు సంబంధించి లెక్కలు చెప్పలేదు. డీఎల్‌డీవో ముందు మంగళవారం విచారణకు హాజరైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తమకు రెండు రోజులు గడువిస్తే జమా ఖర్చులు సమర్పిస్తామని చెప్పినట్టు ఒక అధికారి చెప్పారు. ఇక్కడ నిర్మించిన దుకాణ సముదాయంలో పంచాయతీ ఉద్యోగులు తమ బంధువుల పేరిట కూడా దుకాణాలు పొందడం తాజాగా బయటపడింది. అలాగే దుకాణదారుల నుంచి పంచాయతీ డిపాజిట్‌గా వసూలుచేసిన రూ.45 లక్షలకు సంబంధించిన వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నట్టు సమాచారం.



## ఆకాశ.. వీధిలో

ఆకాశవీధి అదిరిపోయింది.. ఎంతలా అంటే.. వెళ్లే అవకాశం ఉంటే ఒకసారి చూసొద్దామా అనేటంత.. మీరూ చూడండి ఎంత అందంగా ఉందో కదా.. చూసిన వారంతా వహ్వా అన్నవారే.. మంగళవారం రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి ఆకాశం అద్భుతంగా కనిపించి ఇలా కెమెరాలో బందీ అయ్యిందీ.. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

## ఆ ఒక్కటీ అడక్కు..నా తొలి సినిమా

### నటుడు పృథ్వీరాజ్



చాగల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆ ఒక్కటీ అడక్కు. సినిమాతో నటుడుగా జీవితం ప్రారంభించా...థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ అనే డైలాగ్ చాల పాపులర్ అయ్యి తనకు బాబా గుర్తింపు తెచ్చి పెట్టిందని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. చాగల్లులో తెలగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ గణపతి నవరాత్రి ఉత్స వాల్లో సోమవారం రాత్రి గండ్రోతు కృష్ణారావు ఆడి టోరియంలో పృథ్వీరాజ్ దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయక్ దర్శకత్వంలో త్వరలో హీరో వెంకటేష్‌తో సినిమా ప్రారంభం అవుతున్నట్టు చెప్పారు.ఉత్సవాలను నిర్వహిస్తూ కళలు, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం బాగుపడాలనే సంకల్పం ప్రజలకు మేలు జరగాలనే లక్ష్యంతో జనసేనాని పవన్ కల్యాణ్ కూటమిలో భాగస్వాములయ్యారన్నారు. ప్రజలకు 25 కేజీల బియ్యం కాదు కావా ల్సింది.. 25 సంవత్సరాల రాష్ట్ర అభివృద్ధి కావాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు.

## ఇంట్లో దూరిన తాచు పాము



యానాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో బుష్ బుష్ అంటూ శబ్దాలు వినిపిస్తున్నాయి..ఏమిటీ వింత శబ్దాలు అనుకుంటున్నారు.. తీరా చూస్తే తాచుపాము.. అంతే ఒక్కసారిగాబెదిరిపోయారు.. పాము పాము అంటూ కేకలు వేశారు.. అది విన్న పాము ఒక్కసారిగా పడగ విప్పింది.. యానాం మినీ సివిల్ స్టేషన్ వెనుక ఉన్న రథం పుంత రోడ్డులో నాగుపాము హల్‌చల్ చేసింది.. బాలికల హాస్టల్‌ను అనుకుని ఉన్న వీటీసీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మూతపడింది. దీంతో భవనంలోపల బయట పెద్దపెద్ద పొదలు ఏర్పడి పాములు తిరుగుతున్నాయి. మంగళవారం ఉదయం వాటిలో నుంచి నేరుగా పాము ఇంటిలోకి దూరినట్లు స్థానికులు చెబుతున్నాయి. ఉదయం కాబట్టి సరిపోయింది అదే రాత్రి సమాయంలో అయితే ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాలు మధ్య ఉండే భవనం శుభ్రం చేయించాలని స్థానికులు కోరారు.

# ఎలుకలను.. పట్టేద్దాం!



### ఎలుకల నివారణ ఇలా చేయవచ్చు

వేసవి లేదా దమ్ము సమయంలో గట్లను చెక్కి వాటి పరిణామాన్ని తగ్గించడం, కలుపు మొక్కలు తీసివేయడం, బాటలు తీయడం ద్వారా ఎలుకల ఉధృతిని కొంత మేర తగ్గించవచ్చు. ఎలుకబోనులు, బుట్టలు వినియోగించి పంట తొలిదశలోనే నియంత్రించాలి. ఎలుకలు ఉండే బొరియల్లో ఊదర యంత్రాన్ని వినియోగించి పొగ పెట్టి చంపాలి. గుడ్ల గూబలను సంరక్షించడం ద్వారా ఎలుకలను నివారించవచ్చు. ఎలుకల నిర్మూలనకు రసాయనిక పద్ధతి మంచి ఫలితాలను ఇస్తుంది. బ్రోమోడయోలిన్ మందును వరి నూకల ఎరలో 0.005 శాతం మోతాదులో కలిపి వాడాల్సి ఉంటుంది. దీనిని తిన్న ఎలుకలు 5-6 రోజుల్లో చనిపోతాయి. ఎలుకల నివారణకు వినియోగించే బ్రోమోడయోలిన్ మందును వ్యవసాయశాఖ ఉచితంగా సరఫరా చేస్తోంది. హెక్టారుకు కనిష్టంగా 10 గ్రాముల మందును వాడాల్సి ఉంటుంది. 100 గ్రాముల విషపు ఎర తయారీకి 2గ్రాముల బ్రోమోడయోలిన్ మందు,96 గ్రాముల నూకలు, 2గ్రాముల నూనె కలిపి సజీవ బొరియకు 10 గ్రాముల ఎరను పొట్లాలుగా పెట్టాలి.



బ్రోమోడయోలిన్ మందు కలిపే విధానంపై అవగాహన

- ఎలుకలను విస్మరిస్తే అపార నష్టం
- వరి దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం
- నేటి నుంచి సామూహిక ఎలుకల నివారణ
- బ్రోమోడయోలిన్ మందు ఉచితంగా పంపిణీ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమలు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఎలుకలే కదా అని విస్మరిస్తే అవి కలిగించే నష్టం అపారం. దిగుబడులు గణనీయంగా తగ్గి 50 శాతం వరకూ నష్టాన్ని కలుగజేస్తాయి. వీటి సామూహికంగా నిర్మూలిస్తేనే రైతులు కష్టాల నుంచి బయటపడతారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నారు. పకృతి వైపరీత్యాల కంటే ముందు రైతులకు ఎలుకల రూపంలో బెడద ఎదురవుతోంది. విత్తనం వేసిన దగ్గర నుంచి నాట్లు, పొట్ట, ఈనే, వరి కంకులు, గింజ గట్టిపడే దశల్లో, కోతలు, ఇత ర సమయాల్లో, వరి కుప్పలు పొలాల్లో ఉంచినా ఇవి నష్టాన్ని కలగజేస్తాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నష్టశాతం అధి కంగా ఉండడం రైతులను కలవరానికి గురిచేస్తోంది.

### ఎలుక జీవితకాలం 18 నెలలు

ఎలుకల జీవితకాలం 12 నుంచి 18 నెలలు. తన జీవితకాలంలో ఒక ఎలుక పది కిలోల వరకూ ఆహార ధాన్యాలను తిని మరో 100 కిలో లు పాడు చేస్తోంది. ఎలుకలతో పాటు పందికొక్కులు, ఇళ్లల్లో తిరిగే ఎలుక జాతులు వరి పంటకు 10 నుంచి 50 శాతం వరకూ నష్టాన్ని కలుగజేస్తాయి. ఎలుకలు ఉలి వంటి ముందు పళ్లతో పంటకు నష్టం చేకూరుస్తాయి. ఈ పళ్ల రోజుకి 0.4 మి.మీల వంతున పెరిగి కపాలాన్ని చీల్చుకపోయి ఎలుక మరణించే అవకాశం ఉంది. దీని నుంచి తమను తాము కాపాడుకునేందుకు ఎదురైన ప్రతి వస్తువును ఎలుకలు కొరుకుతాయి. పొలాల్లో వరి పంటను ఇదే రీతిలో కొరుకుతూ ఉంటాయి. వరి దుబ్బులను ఏటవాలుగా 45 డిగ్రీల కోణంలో నీటిమట్టం పైభాగంలో కత్తిరించి నష్టాన్ని కలగచేస్తాయి. కాండాన్ని, మొవ్వలను తింటాయి. కుదురు ఏర్పడిన నాటి నుంచి కోత సమయం వరకూ ఎలుకలు విభృంజిస్తాయి. పాలు పోసుకుంటున్న, గట్టి పడుతున్న కంకులను కొరికి వాటిని బొరియల్లో దాచుకుంటాయి. రాత్రి పూట తిరిగే ఎలుకలు పగటి పూట మా త్రం అంతగా సంచరించవు. పొలాల్లో వరి ఇతర పంటలు ఉంటే ఎలుకలు అక్కడే ఎక్కువగా సంచరిస్తాయి. పంట లేకుంటే ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతాయి.

### ఎలుకల నియంత్రణపై రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమం



వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నియంత్రణపై బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రైతులకు ఎలుకల బొరియల గుర్తింపు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తాం. రైతులు వరినూకలు,నూనె తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వస్తే బ్రోమోడయోలోన్ మందు అందజేస్తాం. - **స్వాతి, వ్యవసాయ సహాయ సంచాలకురాలు, పిఠాపురం**



వాళ్లు చదువుకున్న వెలగతోడు హైస్కూల్‌లో సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

# కష్టపడి..టీచర్లయ్యారు!

## డీఎస్సీ కొట్టిన రోడ్ రోలర్ డ్రైవర్.. తాపీమేస్త్రి



సన్యాసి రావు  మణి కుమార్

మండపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చదువుకున్నామన్న గర్వం వారిద్దరికీ లేదు. చదువుకుంటే ఇప్పుడు కాకపోతే ఎప్పుడైనా ఉద్యోగం వస్తుందన్న ఆశ మాత్రం ఉంది. అయినా సరే, ఖాళీగా ఉండకుండా కుటుంబ పోషణ కోసం ఒకరు రోడ్డురోలర్ డ్రైవర్ అయ్యారు. మరొకరు తాపీమేస్త్రీగా పనిచేస్తూ వచ్చారు. ఇంతలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. పగలు తమ పని చేసుకుంటూ రాత్రిళ్ల డీఎస్సీకి ప్రిపేర్ అయ్యారు. చివరకు విజయం సాధించి ఉపాధ్యాయుల య్యారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం వెలగతోడు గ్రామానికి చెందిన మాచర్ల మణికుమార్, ముల్లు సన్యాసిరావు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నారు. బీఈడీ కూడా పూర్తిచేశారు. తర్వాత ఉపాధి కోసం మణికుమార్ తాపీపని చేస్తుండగా, సన్యాసిరావు రోడ్డు రోలర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. డీఎస్సీ ప్రిపరేషన్ కోసం కోచింగ్‌కు వెళ్లే స్థోమత లేక వీరిద్దరూ పగలు పనులకు వెళుతూ రాత్రి సమయాల్లో ఇంటి వద్దే చదివేవారు. డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరచి మణికుమార్ 99వ ర్యాంక్ సాధించగా.. సన్యాసిరావు 336వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. చదువు తరగని ఆస్తిగా భావించిన ఈ ఇద్దరు కష్టపడి చదివి కోచింగ్ లేకుండా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన నేపథ్యంలో వెలగతోడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సొంటెటి శ్రీనివాసరావు మంగళవారం పాఠశాలలో వీరిని సత్కరించారు. తమ పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ పోస్టులు సాధించిన వారిని సత్కరించడం తమ కెంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం వీరిద్దరూ మాట్లాడుతూ టీచర్లుగా మంచి పేరు తెచ్చుకుంటామన్నారు.టీచర్లు యేసురాజు,వీరవెంకట్రావు, సాయిబాబు, వీర భద్రరావు, సహదేవుడు, వీర్రాజు, స్వామినాథ్, తారకం, కృపామణి, ఆనంద్ అభినందించారు.

# తగ్గుతున్న వరద ఉధృతి

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- కాటన్ బ్యారేజ్ నుంచి 9,47,435 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. రెండు రోజులుగా ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించిన నీటి మట్టం మంగళవారం మధ్యాహ్నం 3.45గంటలకు 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకుంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 9,47,435 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.ఎగువన అన్ని ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటి ప్రభావంతో భద్రాచలం వద్ద మంగళవారం మధ్యాహ్నం 12గంటల వరకు తగ్గిన నీటి మట్టం 41.30 అడుగులకు చేరుకుని సాయంత్రం 6గంటల వరకు అదే రీడింగ్ వద్ద కొనసాగింది.

### ఎగువ నీటి మట్టాలు ఇవే

ఎగువ ప్రాంతాల్లో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద నీటి మట్టం 9.960 మీటర్లకు చేరుకోగా పేరూరు వద్ద 14.930 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.160 మీటర్లు, భద్రాచలం వద్ద 41.30 అడుగులు, కూనవరం వద్ద 18.080 మీటర్లు, కుంట వద్ద 10.220 మీటర్లు, పోలవరం వద్ద 11.950 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.100 మీటర్లుగా నీటి మట్టం నమోదయింది.

### 2068 టీఎంసీలు కడలి పాలు

కాటన్ బ్యారేజ్ నుంచి నేటి వరకు 2068.921 టీఎంసీల నీరు కడలిలో కలిసిపోయింది. గోదావరికి వరదల సీజన్ ప్రారంభమైన తరువాత ఆగస్టులో రెండు సార్లు ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. వరదలు లేని జూన్‌లో 24.914 టీఎంసీల నీరు కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహించగా జూలైలో 677.682 టీఎంసీలు, ఆగస్టులో 1219.405 టీఎంసీల నీరు సముద్రంలోకి కలిసింది.సెప్టెంబరులో రెండు రోజులకే 146.920 టీఎంసీలు సముద్రంలోకి ప్రవహించింది

## తగ్గుతూ.. పెరుగుతూ..

చింతూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరద భయం లోతట్టు వాసుల్ని వదలడం లేదు. పదిహేను రోజులుగా తగ్గుతూ పెరుగుతూ కంటి మీదకునుకు లేకుండా చేస్తోంది.ఉదయం పూట తగ్గింది కదా అని కాసింత ఊపిరి పీల్చుకుంటే సాయంత్రం మళ్లీ పెరుగుతోంది. మంగళవారం ఉదయం భద్రాచలం వద్ద నీటి మట్టం 40.90 అడుగులుగా ఉండగా, రాత్రి 8గంటలకు స్వల్పంగా పెరిగి 41.90 అడుగులకు పెరిగింది. ఇక చింతూరు వద్ద శబరి నది ఉదయం 31 అడుగులుగా ఉండగా సాయంత్రం 8గంటలకు 32 అడుగులకు పెరిగింది. ఈ క్రమంలో మన రాష్ట్రం మీదుగా ఒడిస్సాకు వెళ్లే జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం వరకు సాగగా.. సాయంత్రం నిమ్మలగూడెం-కుయుగూరు వాగుపై ఉన్న వంతెన నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సోకిలేరు, చీకటివాగుల ఉధృతి పదిహేను రోజులుగా కొనసాగుతోంది. దీంతో రామన్నపాలెం, పెద్దసీతనపల్లి, ముకునూరు, ఏజీ కొడేరు పంచాయతీల పరిధిలోని గ్రామాల్నీ దిగ్బంధంలోనే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నాటు పడవలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల చికిత్స కోసమని ఆసుపత్రులకు తరలించిన ముగ్గురు మహిళలు మృతి చెందడంతో వారి మృతదేహాలను సైతం పడవలపైనే తరలించారు. ఎగువ రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలలో వర్షాలు కొనసాగుతున్నాయి.



మంగళవారం ఉదయం ఒడిస్సా హైవేపై వాహన రాకపోకలు



మంగళవారం సాయంత్రానికి ఒడిస్సా హైవేపై పెరిగిన వరద

## కాకినాడలో 190 వాహనం

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 108 వాహనాలు కాలం చెల్లి మరమ్మతులకు గురవుతున్న నేపథ్యంలో వాటి స్థానంలో నూతనంగా 190 వాహనాలను అత్యాధునిక సాంకేతికతతో ప్రభుత్వం దశల వారీగా ప్రారంభించదలచింది. అందులో భాగంగా నూతన 190 వాహనాన్ని కాకినాడ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ నూతన అంబులెన్స్‌లో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్, ప్రాణాపాయంలో ఉన్న క్షతగాత్రులకు వెంటిలేటర్ సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా అధికారి రాధా కృష్ణ, 108 డీఎం అభినాష్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పనపల్లిలో ఫ్లెక్సీ వివాదం

### దళిత సంఘాల ఆందోళన..తొలగింపు

మామిడికుదురు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి మార్కెట్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ వల్ల వివాదం తలెత్తింది. గ్రామ దళిత సంఘాలు ఫ్లెక్సీలో పేర్కొన్న వ్యాఖ్యలను ఖండిస్తూ ఆందోళన నిర్వహించారు. 'మీరెంత? మీ స్థాయి ఎంత ? రోడ్డు పడేస్తాం కొడకల్లారా! ఇది పవన్‌కల్యాణ్ సీమ, ఎప్పటికీ మాదే! అన్న వ్యాఖ్యలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని దళిత సంఘాలు తీవ్రంగా విమర్శించారు. దళితుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఫ్లెక్సీలో ఈ వ్యాఖ్యలు చేశారని అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరును వక్రీకరించే విధంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీని ఏర్పాటుచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నగరం ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితిని సమీక్షించి ఆందోళనకారులతో చర్చించారు. జనసేన నాయకులు ఆ ఫ్లెక్సీని తొలగించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పలువురు పాల్గొన్నారు.

## సమృద్ధిగా యూరియా నిల్వలు

### వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీ రావు పేర్కొన్నారు. అమరావతి నుంచి ఆయన మంగళవారం వివిధ జిల్లాల వ్యవసాయశాఖ జేడీలు, ఏడీఏలు, ఏవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ సీపోర్టుకు ఇండోనేషియా నుంచి వచ్చిన 40వేల మెట్రిక్ టన్నుల యూరియాలో ఏపీకి 17వేల మెట్రిక్ టన్నులను కేంద్రం కేటాయించిందన్నారు. అలాగే ఇతర పోర్టులకు వచ్చే యూరియా నుంచి కూడా పెద్దఎత్తున ఏపీకి కేటాయిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. కాకినాడ జిల్లాలో కావాల్సిన మేరకు యూరియా సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, విజిలెన్స్ బృందాలు ఎరువుల అక్రమ నిల్వలపై దాడులు చేయాలన్నారు. ఈనెల 30వ తేదీలోపు ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురంలో నాకో బృందం పర్యటన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నాకో బృందం

పెద్దాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) లో ఉన్న ఐసీటీసీ, సంపూర్ణ సురక్ష, లింక్ ఏఆర్టీ కేంద్రాలను నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో, న్యూఢిల్లీ) బృందం మంగళవారం సందర్శించింది.నాకో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎంటీ దాస్, కన్సల్టెంట్ రాహుల్ అహూజాతో కూడిన బృందం ఇక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. దీనిలో భాగంగా హెచ్‌ఐవీ బాధితులకు అందుతున్న సదుపాయాలు, పనితీరు, భాగస్వామ్య పరీక్షలపై ఆరాతీశారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీటీసీ, సంపూర్ణ సురక్ష కేంద్రం, లింక్ ఏఆర్టీ కేంద్రాలకు వచ్చే వారి వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జస్వీందర్ సింగ్, డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్, అదనపు డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ప్రభాకర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సుకుమార్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బుజ్జిబాబు, నాజియా హౌస్సేన్, శశి, చంద్రమౌళి, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకే వర్గీకరణ

### మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశంలో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు జరిగిన అతిపెద్ద రాజకీయ కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్‌ఎస్ రత్నాకర్ విమర్శించారు. ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా దళితుల ఐక్యతను దెబ్బతీస్తూ లబ్ధి పొందాలనే లక్ష్యంతో ఎస్సీ వర్గీకరణ చేపట్టారని ఆరోపించారు. కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రత్నాకర్ మాట్లాడుతూ వర్గీకరణతో వందలో నలుగురికి మాత్రమే లబ్ధి చేకూరుతుందన్నారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలుంటే ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే చట్టాలు చేశారన్నారు. వర్గీకరణను వెనక్కు తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రత్నాకర్ హెచ్చరించారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు, నెల్లి సూరిబాబు, గుత్రాల రాంబాబు, యెనుముల సత్తిబాబు, జీకురుమెల్లి కిరణ్ కుమార్, కేవీవీ సత్యనారాయణ, గుత్రాల చిట్టిబాబు, నల్లా ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

## సరస్వతిదేవికి అభిషేకం

### పిఠాపురానికి భారీగా తరలిన భక్తులు



సరస్వతిదేవికి అభిషేకం చేస్తున్న స్వామిజీ

పిఠాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రంలో సరస్వతిదేవికి మూలానక్షత్రం సందర్భంగా తేనె, పాలుతో అభిషేకం నిర్వహించారు. క్షేత్రంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ ఈ పూజాధికాలు నిర్వహించారు, నవరాత్రుల సమయంలో సరస్వతి దేవికి విశిష్టస్థానం ఉందని స్వామిజీ తెలిపారు. అమ్మవారిని జ్ఞానస్వరూపిగా అందరు కొలుస్తారని చెప్పారు. హంస వాహనంపై అమ్మవారు ఉంటారని, హంసకు పాలు, నీరుని వేరు చేయగల శక్తి ఉందని తెలిపారు. కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా వచ్చారు.



అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు

## అంతర్వేదిలో వైభవంగా పవిత్రోత్సవాలు



స్వామి,అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో సోమవారం రాత్రి ప్రారంభమైన స్వామివారి పవిత్రోత్సవాల్లో రెండో రోజు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమయ్యాయి. స్వామివారి పురాతన కల్యాణ మండపం వద్ద ఉత్సవ మూర్తులను ప్రత్యేక సింహాసనంపై ఆసీనులు చేసి పంచామృతాలతో, పంచ సూక్తాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు జరిపారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. బుధ, గురువారాల్లో పవిత్రోత్సవాలు మరింత వైభవంగా జరుగుతాయని ఏసీ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాల రాజాబహదూర్, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి మంగళవారం ఒక దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. తొండంగి మండలం బెండపూడికి చెందిన మద్దుకూరి అన్నపూర్ణ లక్ష రూపాయలను దేవస్థానం చైర్మన్ రోహిత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం అందించారు.

# ఉప్పాడలో ఎగసిపడుతున్న కెరటాలు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఉధృతంగా ఉన్న సముద్రం

### వాతావరణంలో మార్పులు
### ఆందోళనలో మత్స్యకారులు

ఏడాది వేట నిషేధం అనంతరం సముద్రంలో సరైన పాటులేకపోవడంతో తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచు అల్పపీడనాలు, తుఫాన్‌లతో వేటకు వెళ్లకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరిత ఆవర్తనం ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతం మంగళవారం సాయంత్రం నుంచి ఉధృతంగా మారింది. ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకు సముద్రం చాపలా దర్శనమిచ్చింది. సాయంత్రం 5 గంటలు దాటాక సముద్రంలో అలలు క్రమేపీ ఉధృతవుతూ ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఉన్నట్టుండి వాతా వరణం అకస్మాత్తుగా మారడంతో తెల్లారేసరికి వాతావరణం ఎలా ఉంటుందోనని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా



మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లను తాకుతున్న కెరటాలు

## నర్సింగ్ పరీక్షల మాస్ కాపీయింగ్‌పై...
# సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసులు

### వారం రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశం

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) సప్లిమెంటరీ పరీక్షలు కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంసీలో జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే అక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతుందని వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన ప్రత్యేక వైద్యాధికారుల కమిటీ సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా మాస్ కాపీయింగ్ జరిగిందని నివేదికను డీఎంఈకి సమర్పించింది. ఈ నేపథ్యంలో వారం రోజుల్లో పు మాస్ కాపీయింగ్‌కు గల కారణాలను రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని డీఎంఈ షోకాజ్ నోటీసులు అందించారు. ఇదిలా ఉంటే ఆర్‌ఎంసీ అధికారులు డీఎంఈకి ఇచ్చిన నివేదిక లో సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా మాస్ కాపీయింగ్ జరిగిందని, అలాగే పరీక్షలు రాసే నర్సింగ్ అభ్య ర్థులు కూర్చునే బెంచీలు కాపీయింగ్‌కు పాల్పడడానికి వీలుగా ఉన్నాయని, పరీక్ష హాల్లోకి వెళ్లేముందు తనిఖీలు చేసే పర్యవేక్షణ కొరవడిందని పేర్కొన్నారు. ఈ నోటిసులు సూపరింటెండెంట్‌తో పాటు డీసీఎస్ ఆర్‌ఎంవో, ఇన్విజిలేటింగ్ సిబ్బంది అందరికి అందజేశారు. అయితే గతంలో మినిస్టీరియల్ సిబ్బందిని ఇన్విజిలేటర్లుగా వేసేవారు. కారణం వారికి నర్సింగ్ సబ్జెక్ట్‌తో సంబంధం ఉండదు. కానీ ప్రస్తుతం ఇన్విజిలేటర్లుగా సుమారు 30 మంది రెగ్యులర్, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను వేయడంతో వారికి నర్సింగ్ సబ్జెక్ట్‌పై అవగాహనా విద్యార్థులకు పరీక్షల్లో సహకరించేందుకు అనువుగా ఉంటుంది. అందువల్ల నర్సులను ఇన్విజిలేటర్లుగా ఎందుకు వేయాల్సి వచ్చిందనే దానిపై కూడా కమిటీ నివేదిక ఇచ్చింది. నర్సులను పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వేయడం వల్ల జీజీహెచ్‌లో రోగుల సేవలకు అంతరాయం ఏర్పడిందని, ఇప్పటికే నర్సుల సంఖ్య తక్కువ కావడంతో వైద్య సేవలు అంతంతమాత్రంగా ఉన్నాయని ప్రజా సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

## మహిళపై హత్యాయత్నం
# నిందితుడి అరెస్ట్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తూ మనస్పర్థల నేపథ్యంలో మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడ్ని తిమ్మాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన వివాహితతో పరకాలువకు చెందిన మేడిశెట్టి రామకృష్ణ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. వారిద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఆమె నెల రోజులుగా రామకృష్ణతో మాట్లాడటం లేదు, ఇంటికి రానివ్వడం లేదు. దాంతో ఆమెపై కక్ష పెంచుకున్న నిందితుడు ఆగస్టు 30వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో కత్తితో వివాహితపై హత్యాయత్నానికి పాల్పడి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి అరుపులకు చుట్టుపక్కలవాళ్లు రావడంతో నిందితుడు పరారయ్యాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆమెను మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన తిమ్మాపురం ఎస్‌ఐ వై.గణేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం సూర్యా రావుపేట నేవల్ హెలిపాడ్ సమీపంలో బీచ్‌లో నిందితుడు ఉన్నారన్న సమాచారంతో ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

# కాకినాడలో రెండు రాజకీయ పార్టీలకు ప్రధాన ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన రెండు రాజకీయ పార్టీలకు ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. వీటిలో కాకినాడ ట్రెజరీ కాలనీలో ఉన్న ప్రజా పాలన పార్టీ, కాకినాడ ఎస్.అచ్చుతాపురంలో ఉన్న పేదరిక నిర్మూలన పార్టీలు ఉన్నాయన్నారు. 2019 నుంచి ఆరేళ్లపాటు ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయని, గుర్తింపు పొందని ఈ రాజకీయ పార్టీలకు నోటీసులు ఇచ్చామన్నారు.

# పుల్లల కోసం వెళ్లి.. పుట్టెడు శోకం మిగిల్చి..



రోదిస్తున్న పెండ్ర లక్ష్మి కుటుంబసభ్యులు

### ఏలేరు కాలువలో ఇద్దరి మృతి
### కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఘటన

ఏలేశ్వరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు కాలువలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయినవారు వరుసకు వదిన, ఆడపడుచు అవుతారు. స్థానికులు, పోలీసులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మందుల కాలనీకి చెందిన పెండ్ర లక్ష్మి (38), పొరుగున ఉన్న పెండ్ర కుమారి (13)తో మంగళవారం పుల్లల కోసం ఏలేరు కాలువ గట్టుకు వెళ్లారు. మంచినీళ్లు తాగేందుకు వెళ్లిన కుమారి కాలువలో మునిగిపోతున్న విషయాన్ని లక్ష్మి గమనించి కాపాడేందుకు వెళ్లింది. ఈక్రమంలో ఇద్దరు కాలువలో గల్లంతయ్యారు. కాలువ వద్దనే దుస్తులు ఉతుకుతున్న కొందరు సమాచారాన్ని కాలనీవాసులు, పోలీసులకు తెలిపారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి గత ఈతగాళ్లతో గాలించగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆ ఇద్దరు చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రామలింగేశ్వరరావు పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.





మరణించిన లక్ష్మి, కుమారి (ఫైల్)

### రెండూ పేద కుటుంబాలే..

పెండ్ర లక్ష్మి, అప్పన్న పేద కుటుంబానికి చెందిన వారే. అప్పన్న తలవెంట్రుకలకు సామాన్లు ఇచ్చే వ్యాపారం చేస్తూ భార్య, నలుగురు పిల్లలను పోషిస్తున్నాడు. భార్య గృహిణిగా ఉంటూ కట్టెల కోసం వెళ్లి మృత్యువాత పడింది. భార్య మృతితో పిల్లలకు ఆసరా లేకుండా పోయిందని అప్పన్న విలపిస్తున్నాడు. ఇదే కాలనీకి చెందిన పెండ్ర సత్తిబాబు, అంకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారిలో రెండో కుమార్తె అయిన కుమారి మరణించడంతో ఇంటి పనుల్లో సహకారంగా ఉండేదని గుర్తుచేసుకుని తలిదండ్రులు రోదిస్తున్నారు. పుల్లల కోసం వెళ్లి మృత్యువాత పడటం కుటుంబ సభ్యులకు శోకాన్ని మిగిల్చింది.

### ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. బంధువులు, పోలీసులను వివరాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటానని ఆమె భరోసా ఇచ్చారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

# డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 93మంది హాజరు

### రాత్రి వరకూ కొనసాగిన తనిఖీ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా డీఎస్సీ 2025 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెరిట్ అభ్యర్థుల రెండో విడత సర్టిఫికెట్లు వెరిఫికేషన్ మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకూ జరిగిన ఈ ప్రక్రియకు 93మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంఈవో, గెజిటెట్ హెచ్‌ఎం, డిప్యూటీ తహశీల్దార్, ఎంఐఎస్ ఆపరేటర్లతో కూడిన 5 తనిఖీ బృందాలు అభ్యర్థుల పరిశీలన చేపట్టారు. సోమవారం సాయంత్రం నుంచి అభ్యర్థులకు కాల్‌లెటర్లు జనరేట్ కాగా వారంతా వచ్చి సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకున్నారు. తనిఖీ వివరాలను ఈ బృందాలు ఆన్‌లైన్ చేశారు. తనిఖీ జరుగుతున్న తీరుని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, డీసీఈబీ కార్యద వెంకట్రావు పరిశీలించగా, గొల్లప్రోలు ఎంఈవో శివప్రసాద్ తదితరులున్నారు.

### విమానంలో వచ్చి...

కాల్‌లెటర్లు అయిన అభ్యర్థులు కొంతమంది ఆన్‌లైన్‌లో వాటిని డౌన్‌లోడ్ చేసుకోలేదు. హాజరు కాని వారి వివరాలు గుర్తించిన తనిఖీ బృందాల్లోని ఎంఈవోలు అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం అందించారు. చివరి క్షణంలో సమాచారం అందడంతో హైదరాబాద్‌లో ఉండిపోయిన ఇద్దరు అభ్యర్థులు విమానంలో రాజమహేంద్రవరం వరకూ వచ్చి అక్కడ నుంచి కారులో చేబ్రోలుకు మంగళవారం రాత్రి చేరుకున్నారు. మరో అభ్యర్థి శ్రీకాకుళంలో ఉండగా సమాచారం అందడంతో కారులో నేరుగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న పలువురు ఆలస్యంగానే తనిఖీకి వచ్చారు. రాత్రి పది గంటలకు ప్రక్రియ పూర్తైంది.



వెరిఫికేషన్ కోసం హైదరాబాద్ నుంచి చేబ్రోలుకు వచ్చిన అభ్యర్థిని

# చోరీ చేసి చిక్కారు..

### రాణేలంకలో ఇద్దరు యువకులను చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగింత



రాణేలంకలో యువకులను చెట్టుకు కట్టిన దృశ్యం

ముమ్మిడివరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి దోపిడీకి పాల్పడిన ఇద్దరు యువకులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంకలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన చేబోలు సుబ్రహ్మణ్యం తన ఇంటిని అద్దెకు ఇచ్చి అమలాపురంలో ఉంటున్నాడు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్నవారు కూడా ఇటీవలే ఖాళీ చేయడంతో ఇంటికి తాళం వేశారు. అయితే సుబ్రహ్మణ్యం తన పాత ఇత్తడి సామాన్లను ఒక గదిలో పెట్టి తాళాలు వేశాడు. మంగళవారం ఉదయం ముగ్గురు వ్యక్తులు మోటారు రిక్షాలో వచ్చి ఇంటి తలుపులను పగులకొట్టి గదిలో ఉన్న పాత ఇత్తడి సామాగ్రిని దొంగిలించుకుపోతుండగా స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు దొరకగా మరో వ్యక్తి ఇంజను రిక్షాలో పరారయ్యాడు. వారిని చెట్టుకు కట్టి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి వారిని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది.

## ఆరు కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి నివారణ చర్యల్లో భాగంగా అల్లూరి జిల్లా డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు డొంకరాయి గ్రామశివారు ఉండి వద్ద మంగళవారం జరిపిన తనిఖీల్లో జెండాకూపి గ్రామానికి చెందిన కిలో సాము వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. దీని విలువ రూ.33 వేలు వరకు ఉం టుంది. మధ్యవర్తుల సమక్షంలో ముద్దాయి కిలో సామును రిమాండ్‌కి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## ఘర్షణపై కేసు నమోదు

రావులపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో తలెత్తిన ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి.. రావులపాలెం మండలం ఈతకోటలో పవన్‌పుట్టినరోజు సందర్భంగా స్థానిక గౌడ రామాలయం వద్ద సైలెన్సర్లు లేకుండా కొంతమంది బైకులతో ర్యాలీ నిర్వహిస్తుండగా, అక్కడున్నవారు ఈ సౌండ్ ఏమిటని ప్రశ్నించారు. దీంతో వివాదం తలెత్తడంతో మట్టా సూర్యనారాయణ, మట్టా సుబ్బలక్ష్మి, మానే ఐశ్వర్యకు గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు కొత్తపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# న్యాయం చేయాలి

- రంపచోడవరంలో విద్యార్థి అనుమానాస్పద మృతిపై కొనసాగుతున్న ఆందోళన
- రెండో రోజూ రోడ్డెక్కిన బాధిత కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘాలు
- ఇంకా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలోనే మృతదేహం .. పూర్తి కాని పోస్టుమార్టం



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు

రంపచోడవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి వివేకానంద రెడ్డి (14) అనుమానాస్పద మృతిపై బంధువులు, ఆదివాసీ సంఘాలు రెండోరోజైన మంగళవారమూ ఆందోళన కొనసాగించారు. విద్యార్థి మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు, బాధిత కుటుంబానికి న్యాయం, ఐటీడీఏ నుంచి సరైన స్పందన లేకపోవడంతో రోడ్డెక్కారు. విద్యార్థి అదృశ్యమైంది మొదలు, మరణించే వరకూ తల్లితండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం, విద్యార్థులను పర్యవేక్షించాల్సిన వారెవరూ విద్యార్థులు వాగుకు వెళ్లే సమయానికి లేకపోవడమే సదరు విద్యార్థి మరణానికి కారణమంటూ వారంతా ఆరోపిస్తున్నారు. ఇందుకు బాధ్యులుగా ఐటీడీఏ ఉన్నతాధికారుల నుంచి పాఠశాల వార్డెన్ వరకూ అందరిపైనా క్రిమినల్ కేసులు, మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పరిహారం ఇప్పించాలని డిమాండ్‌చేశారు. కాగా, విషయం తెలుసుకున్న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వచ్చి మాట్లాడినప్పటికీ ఐటీడీఏ నుంచి స్పందన లేకపోవడంతో సాయంత్రం వరకూ ఆందోళన కొనసాగింది. అయితే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆందోళనకారుల వద్దకు రాలేకపోవడం, ఆదివాసీలు ఎంతకీ ఆందోళన విరమించకపోవడంతో రెండు రోజులైనా మృతదేహానికి శవపరీక్ష జరగకపోవడంతో రంపచోడవరం డీఎస్పీ ప్రశాంతకుమార్ మంగళవారం సాయంత్రం వెళ్లి ఆందోళనకారులతో చర్చించారు. తమకు జరగాల్సిన న్యాయం జరిగేవరకూ తాము తగ్గేదే లేదని, ఉన్నతాధికారులతో సహా బాధ్యులందరిపైనా క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన్ని బాధితులంతా కోరారు. దీంతో బంధువులు, ఆందోళనకారులు ఆసుపత్రి వదిలి వెళ్లిపోయారు. విద్యార్థి మృతదేహం ఆసుపత్రి మార్చురీలోనే ఉండిపోయింది. ఇంకా పోస్టుమార్టం పూర్తి కాలేదు. ఆందోళనలో ఆదివాసీ నాయకులు పల్లాల లచ్చి రెడ్డి, వెదుళ్ల లచ్చిరెడ్డి, సీపీఎం కిరణ్, మట్ల వాణిశ్రీ, బాలు అక్కిన, తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మలికిపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలోని తూర్పుపాలెంలో చోరీకి పాల్పడిన ఆర్.తరఫ్దార్‌ను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బీ.సురేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం తూర్పుపాలెం బస్టాండు వద్ద తరఫ్దార్‌ను అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 37 గ్రాముల బంగారం, చోరీ సొత్తును రికవరీ చేసినట్టు తెలిపారు. తరఫ్దార్ జీవనోపాధి నిమిత్తం వెస్ట్‌బెంగాల్ నుంచి వచ్చి తూర్పుపాలెంలో కొన్నాళ్లు చికెన్ షాపు, ఇటుక బట్టీల్లో పనిచేసేవాడు. చోరీ కేసును వెంటనే ఛేదించిన ఎస్‌ఐను జిల్లా ఎస్పీ అభినందించినట్టు తెలిపారు.

## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన ఒబిలిశెట్టి రవిచంద్రబాల బాలాజీ-లీలావెంకట సత్యవాణి దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు.

# ప్రసవ వేదన

- ఆదివాసీ మహిళకు పురిటి నొప్పులు
- ఆసుపత్రికి తరలించేందుకు నానా అగచాట్లు
- కూనవరం మండలం వలస ఆదివాసీ గ్రామం కన్నాపురంలో ఘటన

కూనవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవి, కటిక చీకటి, జోరు వాన, వెలుతురు లేకపోవడంతో సెల్‌ఫోన్ లైట్ సాయం... వీటన్నింటి మధ్య ఓ గిరిజన మహిళ ప్రసవం.. ఇన్ని అవరోధాలు ఎదుర్కొని ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే ... కూనవరం మండలంవలస ఆదివాసీ గ్రామమైన కన్నాపురంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆది వాసీ మహిళ రవ్వ దేవమ్మకు సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో నరకయాతన పడింది. కాగా, ఆసుపత్రికి తీసుకెళ్దామంటే ఆ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. అయితే ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మైదాన ప్రాంతంలో ఉన్న నర్సింగపేట వచ్చి అక్కడి ఆశా వర్కర్‌కు సమాచారం అందించాడు. దీంతో ఆమె 108కు ఫోన్ చేయగా వాహనం రాగానే ఆమెను ఎక్కించుకుని వెళ్తుండగా సదరు వాహనం సగం దూరం వెళ్లి ఆగిపోయింది. దీంతో రామ్మోహనరావు, ఆశ వర్కర్ లక్ష్మి నడుచుకుంటూ కన్నాపురానికి చేరుకుని దేవమ్మకు ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఆమెను నడిపించుకుంటూ తిరిగి బయలుదేరారు. కాగా రహదారి గుంతలుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. ఈలోగా దేవమ్మకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీనికి తోడు జోరు వాన మొదలవడంతో గొడుగు పట్టుకుని సెల్‌ఫోన్ లైట్ సహా యంతో దట్టమైన అడవిలో ప్రసవించే విధంగా చికిత్స ప్రారంభించారు. చివరకు మగ బిడ్డకు జన్మనివ్వడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం ఆమెను, పసిబిడ్డను కూనవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం తల్లీ, బిడ్డా క్షేమంగా ఉన్నారు.



ప్రసవించిన తర్వాత దేవమ్మ, పసిబిడ్డను 108లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

# చెందుర్తిలో యూరియా కోసం వాగ్వాదం

గొల్లప్రోలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. దీనికోసం తోపులాటలు, వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. గొల్లప్రోలు మండలం చెందుర్తి లోని రైతుసేవా కేంద్రానికి మంగళవారం యూరి యా స్టాకు వస్తుందనే సమాచారం రావడంతో చెందుర్తి, పరిసర ప్రాంతాల రైతులు భారీగా చేరుకున్నారు. తీరా లారీ ఎంతకీ రాకపోవడం, వచ్చినా సకాలంలో పంపిణీ చేపట్టకపోవడంతో తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాసిన రైతులు సహనం కోల్పోయారు. దీంతో తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. 20 టన్నుల యూరియా వచ్చినప్పటికీ సగం మంది రైతులకు కూడా సరిపోకపోవడంతో ... అందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీ సక్రమంగా చేయడం లేదని వారంతా మండిపడ్డారు. తీసుకున్న వారే మరలా తీసుకుంటున్నారని ఆరోపించారు.



రైతుల మధ్య తోపులాట

# వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

- రైలు ఢీకొని ఒకరు ... రోడ్డు ప్రమాదంలో గాయపడి మరొకరు ... శబరి, గోదాట్లో మరో ఇద్దరు ...

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, పశివేదల రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం గుర్తుతెలియని దాదాపు 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్‌ఐ పీ.అప్పారావు తెలిపారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతడి ఒంటిపై తెలుపురంగు చిన్నచారలు కలిగిన పొడవు చేతుల షర్ట్, ఆకుపచ్చ రంగుపై ఎరుపురంగు పువ్వుల డిజైన్ లుంగీ, రంగుల టర్కీ టవల్ ఉన్నాయన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490617090, 99480 10061 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

**ఆలమూరు:** ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఆలమూరు ఎస్‌ఐ జీ.నరేష్ తెలిపారు. వివరాలివి... రావులపాలెం మండలం రావులపాడుకి చెందిన కటకం మోహనరావు (52) రాజమహేంద్రవరం నుంచి బైక్‌పై రావులపాడుకు వస్తుండగా ఆలమూరు మండలం జొన్నాడ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గాయపడిన మోహనరావును రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని మృతదేహం

**వీఆర్‌పురం** : శబరి నదిలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ సంఘటన వీఆర్‌పురం మండలంలో మంగళవారం జరిగింది. వీఆర్‌పురం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధిలోని పత్తిపాక శివారులోని వరద నీటిలో మృతదేహం (పురుషుడు) కొట్టుకు వచ్చిందని, వయస్సు సుమారుగా 30 నుంచి 35 వరకు ఉంటుందన్నారు. మృతుడు ఎరుపురంగు షాట్ మాత్రమే ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. అలాగే నడుముకు పసుపు, ఎరుపు రంగు మొలతాడు కలిగి ఉన్నాడని, ఎవరైనా గుర్తుపడితే ఫోన్‌నెంబర్లు 9490617851, 95994 99366 కు తెలియచేయాలన్నారు.

**మామిడికుదురు:** గోదావరి నదిలో వృద్ధుడు గల్లంతైన సంఘటన మంగళవారం జరిగింది. బి.దొడ్డవరం గ్రామానికి చెందిన ఒలుపు కార్మికుడు రవణం సాయిబాబు (78) బహిర్భూమికి వెళ్లి గోదావరి నదిలో కొట్టుకుపోయినట్టు కుటుంబ సభ్యులు తెలియజేశారు. గల్లంతైన మృతుడి కోసం రెండు పడవల సహాయంతో రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఏవిధమైన ఆచూకీ తెలియరాలేదు. దీనిపై సాయిబాబు కుమారుడు పల్లంరాజు పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

# హత్యా నేరం కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు, జరిమానా

- తాడేపల్లిగూడెం కోర్టు తీర్పు

నల్లజర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం చీపురుగూడెంకి చెందిన చల్లారి వెంకట్రావును అదే గ్రామానికి చెందిన కూసపం బాబూరావు 2021లో ఇనుప రాడ్డుతో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కోర్టు విచారణ అనంతరం నేరు రుజువు కావడంతో మంగళవారం తాడేపల్లిగూడెం కోర్టు బాబూరావుకు ఏడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధించి నట్టు నల్లజర్ల పోలీసులు తెలిపారు. అప్పట్లో వెంకట్రావు ఇంటి వద్ద కల్లు దుకాణం ఉండేది... అక్కడకి కల్లు తాగడానికి వచ్చిన బాబూరావును డబ్బులు అడగ్గా... ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువురూ కొట్టుకున్న సమయంలో బాబూరావుకు పక్కనే ఉన్న ఇనుప రాడ్డు చేతికి అందడంతో వెంకట్రావు తలపై కొట్టడంతో మృతిచెందాడు.

### ముందస్తుగా గురుపూజోత్సవం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సాకుర్రు దివ్యతేజ విద్యానికేతన్‌లో ముందస్తుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురు పూజోత్సవం నిర్వహించారు. ముమ్మిడి ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటం చుట్టూ విద్యార్థులునిలబడి నివాళులర్పించారు. గురువుల గొప్పదనాన్నివివరించారు.

### గణనాథుడికి పూజలు

రాజోలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజోలు కేవీ వీధిలో గణనాథుడి పందిరిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు మట్టా కిరణ్ ముకేష్, కాటోజు ప్రకాష్, మదాసు రాజ్‌కుమార్, దూడల రాజేష్ పాల్గొన్నారు. 5న అన్నసమారాధన, మహాలడ్డూ వేలం పాట ఉంటుందన్నారు.

## వరద ప్రాంతాల్లో పటిష్ఠ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధితో పాటు వరదలకు లంక ప్రాంతాలు ముంచెత్తకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే దేవ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మండలంలో ప్రధానంగా మత్స్యకార సొసైటీలు ఏర్పాటుచేసి మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరయ్యే పథకాలను త్వరితగతిన అందించాలన్నారు. గ్రామాల్లో శివారు ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, రోడ్ల అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతీ గ్రామంలో తాగునీరు సమృద్ధిగా ప్రజలకు అందివ్వాలన్నారు. అలాగే కేశవదాసుపాలెంలో తుఫాన్ షెల్టర్, పలు సీసీ రోడ్ల అభివృద్ధి పనులపై మాట్లాడారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఎంపీటీసీ, సర్పంచ్‌లు రోడ్లకు, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తీసుకుని రావాలన్నారు. అలాగే ఎక్కడ చూసినా వర్షం నీరుచేరి గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, ఆ ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం నియోజకవర్గ వ్యాప్తంగా కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసి చూపించామన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం జన్మదినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే దేవ కేక్ కట్ చేసి వీర మహిళలకు పంచారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సూర్యనారాయణ, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, వైస్ ఎంపీపీ కొల్లాబత్తుల నాని, గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, బళ్ల నోబుల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ కొబ్బరి దినోత్సవం



మాట్లాడుతున్న ఉప్పుగంటి భాస్కరరావు

ముమ్మిడివరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని ముమ్మిడివరం నగరపంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలో మంగళవారం నిర్వహించారు. కోట్ల వెంకటశ్రీరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆగ్రో ఎకనమిక్స్ కన్వీనర్ ఉప్పుగంటి భాస్కరరావు, కోనసీమ అధ్యక్షుడు చేకూరి సూర్యనారాయణ మాట్లాడారు. అనంతరం బీకేఎస్ మండల కార్యవర్గం ఏర్పాటైంది. సమావేశంలో కొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు.బీకేఎస్ సభ్యులు పాల్గొన్నారు.

**అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):** రైతులు కొబ్బరి ఆధారిత ఉత్పత్తులపై దృష్టిసారించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ పి.అశోక్ సూచించారు. అంబాజీపేట పరిశోధన కేంద్రంలో ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కొబ్బరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నీరజ, డాక్టర్ వి.అనూష, డాక్టర్ ఎం.సంఘమిత్ర, డాక్టర్ బి.స్వర్ణలత, రైతు సంఘ నాయకుడు ముత్యాల జమీలు, ఉద్యాన పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

**మలికిపురం, (ఆంధ్రజ్యోతి):** గుడిమెళ్లంకలో సింహాద్రి కొబ్బరి దింపు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని నిర్వహించారు. కోకోనట్ బోర్డు ద్వారా కొబ్బరి కార్మికులకు అమలుచేసే పలు కార్యక్రమాల గురించి సంఘ అధ్యక్షుడు పాండురంగ వివరించారు. సర్పంచ్ నల్లి విజయకుమారి పాల్గొన్నారు.

### జాబ్‌మేళాకు విశేష స్పందన

మామిడికుదురు,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఎస్‌డీసీ, వికాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మామిడికుదురు దీప్తి కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. 227మంది అభ్యర్థులు హాజరుకాగా 127మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు. దీప్తివిద్యా సంస్థలఅధినేత డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీవో డి.హరిశేషు, వికాస మేనేజర్ జి.రమేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.దుర్గాసురేష్, ప్రిన్సిపాల్ మోకా రంగారావు పాల్గొన్నారు.

### కాట్రేనికోనలో ఎలక్ట్రీషియన్స్ సమావేశం

కాట్రేనికోన, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ సమావేశం మంగళవారం జరిగింది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ సంక్షేమానికి ప్రభుత్వం శ్రద్ధ వహించాలని కోరారు. కాగిత సత్తిబాబు, వనచర్ల రాంబాబు, గడ్డం సాయికృష్ణ, రవికుమార్, సంసాని సతీష్, శీలం చిన్నబాబు, పాము శివప్రసాద్ పాల్గొన్నారు.

### మతిభ్రమించి మాట్లాడుతున్న సజ్జల

**టీడీపీ మీడియా కోర్డినేటర్ సతీష్‌బాబు**



అమలాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలన, కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పాలనపై అసెంబ్లీ వేదికగా చర్చకు రావాలని సీఎం చంద్రబాబునాయుడు సవాలు విసిరితే వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని తెలుగుదేశం పార్టీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు ఆరోపించారు. సీఎం చంద్రబాబు సవాలుపై స్పందించడానికి మీరేమైన ఎమ్మెల్యేనా.. ఎమ్మెల్సీనా అని సజ్జలను ప్రశ్నించారు. మంగళవారం అమలాపురంలో మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని సజ్జల పేర్కొడాన్ని తప్పుబట్టారు. ప్రతిపక్ష హోదా ప్రజలు ఇవ్వాలే తప్ప చంద్రబాబు ఇచ్చేది కాదని గ్రహించాల్సిన ఇంగిత జ్ఞానం వైసీపీ నేతలకు లేదన్నారు. ఐదేళ్ళ జగన్ పాలనకు ప్రజలు 11 సీట్లు ఇచ్చారు. ఆ సీట్లతో మీకు ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందని ప్రశ్నించారు.

### వైఎస్సార్ వర్ధంతి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని వైసీపీ శ్రేణులు మంగళవారం అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సేవలను కొనియాడుతూ కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు సంసాని బులినాని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతిలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వస్కా బాబు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. మహబూబ్ షకీలా, కుడుపూడి శ్రీనివాస్, జోగి అర్జునరావు, ఈతకోట సోమరాజు, అయితాబత్తుల కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

# పవన్‌కల్యాణ్ సేవలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- కోనసీమ జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు







అమలాపురంలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, చిత్రంలో ఎంపీ హరీష్‌బాలయోగి, ముమ్మిడివరంలో కేక్ కట్ చేస్తున్న జన సైనికులు, అంతర్వేది: సఖినేటిపల్లి లాకుల వద్ద దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తి దాయకమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లా శ్రీధర్ సతీమణి నల్లా ఇంద్రాణి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జనసేన, పవన్‌కల్యాణ్ అభిమాన సంఘాల సమన్వయంతో అమలాపురం ఐమైండ్స్ స్కూలులో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎంపీ గంటి హరీష్‌బాలయోగితో కలిసి ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. 600మందికి వివిధ విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, బీజేపీ, జనసేన నాయకులు నల్లా పవన్‌కుమర్, కల్వకొలను తాతాజీ, ఆర్డీఎస్ ప్రసాద్, నల్లా శ్రీధర్, యాళ్ల నాగసతీష్, లింగోలు పండు, ఇసుకపట్ల రఘుబాబు, యేడిద శ్రీను, కొప్పుల నాగమానస పాల్గొన్నారు. పేరూరులో డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలను సీనియర్ నాయకుడు మొయిల శివ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్యఅతిథిగా హాజరై పవన్ అభిమానుల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేశారు. అనదతరం పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, నాయకులు గంధం పల్లంరాజు, దేవరపల్లి వీరేష్‌కుమార్, ఇళ్ల రాము, ఆకుల బుజ్జి, కంచిపల్లి అబ్బులు, యేడిద శ్రీను, మంథా ఫణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు ఏకరూపు దుస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో దున్నాల దుర్గ, బొర్రా వెంకటేశ్వరరావు, చిక్కం భీముడు, గండి స్వామి, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, చిక్కం ఉమేష్ పాల్గొన్నారు.

**ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి):** ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను కూటమి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. జనసేపార్టీ పట్టణాధ్యక్షుడు కర్రా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ కాపుకల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో దాట్ల పృథ్విరాజ్, చెల్లి అశోక్, ఓగూరి భాగ్యశ్రీ, కమిషనర్ పి.రవివర్మలు ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంచారు. ముమ్మిడివరం నుంచి ఎదుర్లంక వంతెన వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కొమానపల్లి సెంటర్‌లో గంధం పల్లంరాజు, దాట్ల పృథ్విరాజ్‌లు కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచారు. కొమనాపల్లి జడ్పీహైస్కూలులో జనసైనికులు రూ.25వేలు విలువైన ఫర్నిచర్‌ను సమకూర్చగా వాటిని ఉపాధ్యాయులకు అందించారు.గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కోటిపల్లి సూరిపండుకు గంధం పల్లంరాజు రూ.5వేలు, జనసైనికులు రూ.5వేలు అందించారు. అన్న క్యాంటీనులో కేక్‌ను కట్‌చేసి వేడుకలు నిర్వహించి ఉచితంగా భోజనాన్ని అందించారు. ఆయా కార్యక్రమాల్లో గోదశి పుండరీష్, గుద్దటి జమ్మి, దూడల స్వామినాయుడు, మాదాల శ్రీధర్, అర్థాని శ్రీనివాసరావు, గొటకోటి దొరబాబు,పాయసం సాయి, కామన ప్రసాద్‌గౌడ్, తాడి జానకీరామ్, పిల్లా అనూష, గాలిదేవర బుల్లి, బద్రి రమ, నూకల దుర్గ, మద్దింశెట్టి పురుషోత్తం, పొద్దోకు బాలు, అడబాల సతీష్‌కుమార్, అత్తిలి బాబూరావు, మోకా బాలప్రసాద్, పెన్నాడ తేజ, యలమంచిలి బాలరాజు, జగతా సతీష్, పులిమే గోపి, షేక్ రహీమ్, కుంచనపల్లి వెంకన్నబాబు, కుంచనపల్లి నారాయణ, పెన్మెత్స కృష్ణవర్మ, మారెళ్ల శ్రీను, రంబాల రమణ, కుంచనపల్లి హరి, పోలిశెట్టి కుమార్, చోడపనీడి బాబి, వనిమిశెట్టి మణికంఠ, నిమ్మకాయల దుర్గ, చిక్కం కుమార్, దివి తేజ, సుంకర మణికంఠ పాల్గొన్నారు.

**పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి):** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయాల్లో సామాజిక సేవా ముఖ్యమైనదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరంలో మంగళవారం జరిగిన పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత బెల్లంపూడిలో స్థానిక జనసేన నాయకులు ఏర్పాటుచేసిన రక్త దాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి పేదలకు దుప్పట్లు అందించారు. అనంతరం జనసేన క్యాంపు కార్యాలయంలో కో-ఆపరేటివ్ బ్లడ్ డోనర్స్ వలంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పా టుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పి.గన్నవరం సీహెచ్‌సీకి దుప్ప ట్లు, రోగులకు పాలు, పండ్లు అందించారు. సాయంత్రం కూటమి నాయకులు, అభిమానులు సమక్షంలో కేక్‌కట్ చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నగరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, అటవీశాఖ ఐటీ అడ్వయిజర్ పెనమారెడ్డి నాగబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దాసరి వీరవెంకటసత్యనారాయణ, చొల్లంగి సత్యనారాయణమూర్తి, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, కె.సత్యనారాయణరాజు, శేరు శ్రీనుబాబు, ఆదిమూలం సూరయ్యకాపు, యడ్ల ఏసు, అన్నాబత్తుల హనుమాన్, తాటికాయల శ్రీనివాసరావు, అల్లాడి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వాడ్రేవుపల్లికి చెందిన జనసైనికుడు షేక్ ఖాసీం ఇటీవల మృతిచెందారు. రాజోలు తాలుకా చిరుపవన్ సేవాసమితి, రాజోలు తాలుకా ఫ్యాన్స్ సేవరించిన రూ.లక్ష చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందించారు.సర్పంచ్ పత్తిపాటి ఉమామహేశ్వరి, వైస్ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, పాలూరిఫణి, కందాలచంటి పాల్గొన్నారు.

**యానాం, (ఆంధ్రజ్యోతి):** స్థానిక చిన్నా సెంటర్‌లో పవన్ అభిమానులు, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. అభిమానులు, నాయకులు పవన్ చిత్రపటాలతో బైక్‌లపై యానాంలో ర్యాలీ నిర్వహించారు.

**అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండలంలో ముఖ్యకూడలిల వద్ద పవన్ పుట్టినరోజు కేక్‌ను కట్‌చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. అంబాజీపేట స్త్రీల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్, పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ, కె.పెదపూడిలో పార్టీ నాయకులు సమకూర్చిన సొమ్మును పేదలకు అందజేత, అన్నదానం, రక్తదానం వంటి పలుసేవ కార్యక్రమాలు నిర్వహించారు. అంబాజీపేటలో పవన్ పుట్టిన రోజు కేక్‌ను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కట్ చేశారు. కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, కొర్లపాటి గోపి, షైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ, నేదునూరి పెద్దిరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అంతర్వేది, (ఆంధ్రజ్యోతి):** సినీ ప్రస్థానంతో ప్రజాసేవ చేస్తూ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అందరికీ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సఖినేటిపల్లి లాకుల వద్ద ఎమ్మెల్యే కేక్ కట్‌చేశారు. నీటిసంఘ అధ్యక్షుడు నామన నాగభూషణం ఆధ్వర్యంలో పేదలకు ఎమ్మెల్యే దేవ దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, సుదర్శన హోమం ప్రత్యేక పూజలు జరిపించారు. చిరుపవన్‌చరణ్ సేవాసమితి సఖినేటిపల్లి, మలికిపురం మండలాల సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సఖినేటిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను అభిమానుల మధ్య కూటమి నాయకులు, యువ నాయకుల ఆధ్వర్యంలో కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్, దిరిశాల బాలాజీ, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, తాడి మోహన్‌కుమార్, చాగంటి స్వామి, రావూరి నాగు, ముప్పర్తి నాని, ఆకన బాబ్జినాయుడు, ముదికొండ బుజ్జి, రావి మురళీ, బైరా నాగరాజు, బళ్ల చరణ్, గుండుబోగుల నాగు, జనసైనికులుపాల్గొన్నారు.

**మలికిపురం, (ఆంధ్రజ్యోతి):** పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా పలు సామాజిక కార్యక్రమాలను అమలు చేయడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. తూర్పుపాలెంలో సొసైటీ అధ్యక్షుడు అడబాల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కట్‌చేశారు. శిబిరంలో 400మందికి వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, పెదకాపు, మంగెన భూదేవి, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, యెనుముల నాగు, అడబాల సాయిబాబు, సర్పంచ్ జి.సత్తిబాబు, ఎ.వెంకటేశ్వరరావు, కేవీ రమణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.

**ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి):** జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం గ్రామగ్రామాన జరుపుకున్నారు. ఉప్పలగుప్తం పోలీసు స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన జనసేన నాయకుడు సమకూర్చిన పోలీసు ఏకరూప దుస్తులను అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ చలమల రాజేష్, జనసేన గ్రామకమిటీ అధ్యక్షుడు చిక్కం వెంకటకృష్ణ, సొసైటీ చైర్మన్ చిక్కం ఉమేష్, జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు, నాగులపల్లి రాజు, సలాది గణపతి, ఆకేటి వెంకన్న, గొలకోటి వెంకటేష్, సలాది నాగరాజు, ఆకేటి శ్రీనివాసరావు,గనిశెట్టి లలితాశ్రీనివాసరావు, పాల్గొన్నారు.

**అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి):** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ముక్తేశ్వరం, అయినవిల్లి గ్రామాల్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. పేదలకు వస్త్రాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, సర్పంచ్ కాకర శ్రీనివాస్, డీసీ కాకర శ్రీనివాస్, అంబటి రాజు, పోలిశెట్టి రాజేష్, మేడిద దుర్గాప్రసాద్, అడపా నాగభూషణం, సలాది బుచ్చిరాజు, మద్దా చంటిబాబు, మామిళ్లపల్లి తాతయ్యనాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి):** పెదపట్నం, మొగలికుదురు, మగటపల్లి గ్రామాల్లో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. మగటపల్లిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. చిన్నారులకు రెయిన్‌కోట్‌లను పంపిణీ చేశారు. అదేవిధంగా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. ఆయాకార్యక్రమాల్లో కూటమి నాయకులు, పవన్‌అభిమానులు పాల్గొన్నారు.

**అల్లవరం, (ఆంధ్రజ్యోతి):** పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా అల్లవరం హైస్కూలు వద్ద సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. టీడీపీ ప్రముఖులు మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పాల్గొన్నారు. అల్లవరం సెంటర్‌లో జన సైనికుడు కంకిపాటి వీరబాబు ఆధ్వర్యంలో కోడూరుపాడులో పిల్లా ప్రసాద్, కొమరగిరిపట్నంలో నల్లా రాము, బెండమూర్లంకలో గుర్రం కృష్ణ, మొగళ్లమూరిలో యాళ్ల బిందాస్ ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల కేక్‌లు కట్‌చేసి నాయకులు ప్రసంగించారు. బొడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పవన్ కల్యాన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కల్వకొలను తాతాజీ, నల్లా శ్రీధర్, లింగోలు పండు, కొప్పుల మానస, కేవీ, పచ్చిమాల ఏడుకొండలు, చిట్నీడి శ్రీనివాస్, అల్లు సత్తిబాబు, రాయుడు విష్ణు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, చాట్లమంగతాయారు, అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

**ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి):** పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మురమళ్ళమాణిక్యాంబా ఆలయం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఐ.పోలవరం, మురమళ్ళ, కొమరగిరి కోలావారి మెరక వద్ద జనసైనికులు ఏర్పాటుచేసిన కేక్‌ను నాయకులు కట్ చేశారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు దాట్ల పృథ్వీరాజు, సాగిరాజు సూరిబాబురాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, కాకర్లపూడి రాజేష్, కాకర్లపూడి బుజ్జి, మల్లిపూడి రాజు, దేవు రాంబాబు, రాయపురెడ్డి బాబి, సలాది రాజుతో పాటు అధికసంఖ్యలోజనసైనికులు పాల్గొన్నారు.







పి.గన్నవరంలో రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు: తాటిపాకలో చిరుపవన్ బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఉప్పలగుప్తం: ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించి, వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ

### 'టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం దళితులకు ఇవ్వాలి'

ఐ.పోలవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం దళితులకు కేటాయించాలని ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు) రాష్ట్ర అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మురమళ్ళ టీడీపీ కార్యాలయంలో మంగళవారం దళిత నాయకుల సమావేశం జరిగింది. 1982పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకుదళితులకు ప్రాముఖ్యం ఉన్న పార్టీ పదవులు కేటాయించలేదన్నారు. అధిష్టానం సానుకూలంగా స్పందించి జిల్లా అధ్యక్ష పదవిని కేటాయించాలని కోరారు. ఇందులో భాగంగా జిల్లాలోని శాసనసభ్యులను కలిసి మద్దతు కోరుతున్నట్టుతెలిపారు.

### మొక్కలతో స్వచ్ఛమైన గాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛమైన గాలి లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం రాజమహేంద్రవరం కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావుఅన్నారు. అడబాల ట్రస్ట్, మిషన్‌గ్రీన్ ప్లాంట్ సంయుక్త ఆధ్వర్యంలో గంటిపెదపూడిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2వేలు మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన అడబాల ట్రస్ట్ సాయి, మిషన్‌గ్రీన్‌ప్లాంట్ సభ్యులను ఆయన అభినందించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్‌లు, వృద్ధులకు దుప్పట్లు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్ దంగేటి అన్నవరం, అడబాల ట్రస్ట్ చైర్మన్ అడబాల సాయి, మిషన్ గ్రీన్ ప్లానెట్ కిషోర్, కాండ్రేగుల నరసింహం, వరహాలురాజు, కొమ్ముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### 'ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర'

యానాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ దేశ చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్ర అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.రత్నాకర్ అన్నారు. యానాం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో వందలో నలుగురికి మాత్రమే లబ్ధి చేకూరుతుందన్నారు. పంజాబ్, హర్యానాలో తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణచేస్తే, దేశంమొత్తం ప్రధాని మోదీ అమలు చేస్తున్నారన్నారు. రాజకీయ రంగంలో మాయావతి నుంచి మీరాకుమార్, సుశీల్‌కుమార్ షిండే వంటి వారంతా మాదిగలేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు దేశ వ్యాప్తంగా మాదిగలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణను వెనక్కు తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రత్నాకర్ హెచ్చరించారు. మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు, నెల్లి సూరిబాబు, కమిడి దత్తు ప్రసాద్, బూలా బాలు, తనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

### ఆటోలకు నల్ల జెండాలతో ప్రభుత్వానికి నిరసన





అమలాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం వల్ల తీవ్రంగా నష్టపోయిన భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు మంగళవారం అమలాపురం హైస్కూలు సెంటర్‌లో ఆంధ్ర ఆటోవాలా జిల్లాశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్ల నిరసనలో భాగంగా ఆటో స్టాండ్లతో పాటు ఆటోలకు నల్ల జెండాలు, ప్రతీ డ్రైవరు జేబుకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి నిరసన తెలియచేసేందుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో కోశాధికారి మోకా శ్రీను, వాసంశెట్టి శ్రీను, డివిజన్ అధ్యక్షుడు బొలిశెట్టి శంకర్, ప్రధాన కార్యదర్శి బొక్కా నాని, కోశాధికారి బొమ్మి ఫణి, రాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే గంగయ్య జయంతి

మలికిపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజోలు మాజీ ఎమ్మెల్యే, ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల మాజీ కరస్పాండెంట్ మంగెన గంగయ్య జయంతిని మలికిపురం ఏఎఫ్‌డీటీ కళాశాలలో, పడమటిపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు గంగయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో మంగెన సత్యనారాయణ మూర్తి, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ ఆనంద్‌మహానీ పాల్గొన్నారు.

### విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ముమ్మిడివరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోన్న 15మంది విద్యార్థులకు ప్రావాసాంధ్రుడు డాక్టర్ మోకా గణపతిరావు అడ్మిషన్ ఫీజును నగదు ప్రోత్సాహంగా అందించారు. సైన్స్ విద్యార్థులకు రూ.2,434చొప్పున 12మందికి, ఆర్ట్స్ విభాగానికి సంబంధించి రూ.1,420 చొప్పున ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని సమకూర్చగా కళాశాల ప్రిన్సిపాల్ పీఎల్ ప్రశాంతి ఆధ్వర్యంలో కాశి బాలమునికుమారి అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మెగా వైద్య శిబిరానికి స్పందన

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ జన్మదిన సందర్భంగా నల్లా ఇంద్రాణి మెమోరియల్ ట్రస్టు సౌజన్యంతో జనసేన నాయకులు ఆకుల సూర్యనారాయణమూర్తి, ఆకుల బుజ్జి, చిక్కం సూర్యమోహన్ నిర్వహణలో గొల్లవిల్లి శ్రీనిమ్మకాయల చినరాజప్ప కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆరు రకాల క్యాన్సర్ పరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కాన్, 2 డి ఎకోతో పాటు వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఈ మెగా శిబిరాన్ని అమలాపురం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈశిబిరంలో 500మంది పరీక్షలు చేయించుకోగా వీరిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. స్థానిక నాయకులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కూటమి నాయకులు హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### చిరుపవన్ బస్ షెల్టర్ ప్రారంభం

రాజోలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రాజోలు తాలూకా చిరుపవన్ సేవాసమితి ఆధ్వర్యంలో తాటిపాక సెంటర్‌లో రూ.7.50లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను మంగళవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. రాజోలు చిరుపవన్ సేవాసమితి సభ్యులకు, నిర్మాణానికి కృషి చేసిన గుండాబత్తుల తాతాజీని అభినందించారు. తొలుత అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. మండలంలోని ఆయా గ్రామాల్లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కేక్‌లు కట్‌చేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, ఉప సర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, మాజీ ఎంపీపీ పిల్లిశ్రీరామమూర్తి, పొదలాడ నీటిసంఘం అధ్యక్షుడు ఉలిశెట్టి లక్ష్మణరావు, గుబ్బల ఫణికుమార్, కోళ్ల బాబి, ఉండవల్లి అంజి, తుమ్మలపల్లి నారాయణ ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

### నెలాఖరు వరకు సెక్షన్ 30అమలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో ఈనెల30వరకు సెక్షన్ 30అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని అమలాపురం టౌన్, అల్లవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్నఅన్ని ప్రాంతాలకు సెక్షన్ 30అమలు వర్తిస్తుందన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు.

### ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం: ఎంపీడీవో

అంబాజీపేట, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని గ్రామాల్లో పూర్తిగా నిషేధించేందుకు కృషి చేద్దామని డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు.




ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద తగ్గుముఖం పట్టిన వరద. పక్క చిత్రంలో ఆలమూరు వద్ద తగ్గిన గోదావరి వరద

# తగ్గుతున్న వరద ఉధృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. వారం రోజుల నుంచి గోదావరి పొంగి ప్రవహించడంతో లంక వాసులు భయాందోళనకు గురవగా, మంగళవారం తగ్గుముఖం పట్టడంతో ఊపిరిపీల్చుకున్నారు. బొబ్బర్లంక బ్యారేజీ వద్ద సాయంత్రానికి వరద తగ్గుముఖం పట్టి 11.6 అడుగులు నమోదైంది. సముద్రంలోకి 9.59 లక్షల క్యూసెక్కుల నీరు విడిచిపెట్టారు. మొదట ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.

## నిలకడగా గోదావరి వరద

**ఆలమూరు, (ఆంధ్రజ్యోతి):** గోదావరి వరద ఉధృతి కొద్దిగా తగ్గి నిలకడగా వరద ప్రవాహం కొనసాగుతోంది. చొప్పెల్ల కాజ్‌వే, జొన్నాడ పుష్కర్‌ఘాట్‌తోపాటు మండలంలోని లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలలోని వాణిజ్య పంటలు నీట మునిగే ఉన్నాయి. వరద ఉధృతి తక్కువగా ఉండటంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. జొన్నాడ వద్ద రెండు బ్రిడ్జిల మధ్య వరద ఉధృతితో ప్రవహిస్తున్నది.

# గణేష్ నిమజ్జన ప్రాంతాల పరిశీలన

రాయవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేష్ నిమజ్జనం ప్రాంతాలను మంగళవారం రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు, తహశీల్దారు ఐపీ శెట్టి పరిశీలించారు. ఈసందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ నిమజ్జనంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. నిమజ్జనం రోజున బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. మండలంలో కాలువలో నిమజ్జనాలు జరిపే ప్రాంతాలను తహశీల్దారు, ఎస్ఐ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



చెల్లూరులో వినాయక నిమజ్జనం రేవును పరిశీలిస్తున్న తహశీల్దారు, ఎస్ఐ




వాడపల్లి ఆలయంలో పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

# వెంకన్న ఆలయంలో పారాయణం

ఆత్రేయపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీమన్నారాయణీయం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం, తాడేపల్లిగూడెం, తుని పరిసర ప్రాంతాల నుంచి శ్రీమన్నారాయణీయం పారాయణ సత్సంగం బృందం ఆధ్వర్యంలో వందలాది మహిళలు వచ్చి పారాయణం చేశారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు బృందం సభ్యులను సత్కరించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురుగులు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ చెందినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వద్దిపర్రు గ్రామానికి చెందిన వీరవల్లి నాగేశ్వరరావు(64) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇంటి వద్దనే ఉంటూ మనస్థాపానికి గురై సోమవారం పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కుమారుడు హుటాహుటీన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# రైతులకు మెరుగైన సేవలందించాలి



మాచరలో త్రిసభ్య కమిటీ అధ్యక్షులు, డైరెక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ అన్నారు. మండలంలోని మాచర, కోరుమిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మాచర సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ అధ్యక్షులుగా గుర్రాల సత్యతారాకృష్ణ, డైరెక్టర్లుగా బడుగు నల్లబాబు, మామిడిశెట్టి సూర్యనారాయణ, కోరుమిల్లి సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ అధ్యక్షులుగా తుట్టపు లోవరాజు, డైరెక్టర్లుగా సవరపు రాంబాబు ప్రమాణ స్వీకారం చేశారు. వారిని ఎమ్మెల్యే వేగుళ్ళ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ లీలాకృష్ణ సన్మానించగా వీరిని ఆయా సొసైటీల ఆధ్వర్యంలో సన్మానించారు. తొలుత ఆయా కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ నాయకులు, కూటమి నేతలు, సొసైటీల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుడాల జయబాబు, జనసేన పార్టీ మాచర గ్రామ అధ్యక్షులు కరెడ్ల సురేష్ బాబు, మండల అధ్యక్షులు తుట్టపు నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, నేతలు పువ్వల చిట్టిబాబు, పుత్సల శ్రీనివాస్ తదితరులతో పాటు, ఆయా సొసైటీల సీఈవోలు తోటకూర సురేష్, సలాది మణికంఠ, సిబ్బంది, అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



ఆలమూరులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న బండారు శ్రీనివాస్



రాయవరం మండలం సోమేశ్వరంలో మొక్కలను పంపిణీ చేస్తున్న జన సైనికులు



కె.గంగవరం మండలం కోట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేసిన టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం

## నెలాఖరు వరకు సెక్షన్ 30 అమలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో నెలాఖరు వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలకు సెక్షన్ 30 వర్తిస్తుందన్నారు.

# జనం మెచ్చిన నాయకుడు పవన్ కల్యాణ్

• డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకల్లో మంత్రి సుభాష్ • కేక్ కట్ చేసిన నాయకులు, పార్టీ శ్రేణులు



కపిలేశ్వరపురం మండలం అంగరలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ లీలాకృష్ణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎన్నో అవమానాలు, ఒడిదుడుకులు ఎదురైనా అంతిమంగా ప్రజల మెప్పు పొందిన ప్రజా నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అని మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం పట్టణం, మండలంలో జరిగిన జన్మదిన వేడుకలు, సేవా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌తో పాల్గొని కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుతో కలసి ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. అనంతరం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడారు. ఆర్ఆర్ గ్రాండ్‌లో రక్తదాన శిబిరాన్ని మంత్రి సుభాష్, పోలిశెట్టి శేఖర్ ప్రారంభించారు. రాజబాబునగర్‌లో జెండా స్థూపాన్ని ఆవిష్కరించారు. రామచంద్రపురం మండలం వెల్లలో రక్తదాన శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, జనసేన నాయకులు సంపతి సత్యనారాయణ, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ

**కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను జన సైనికులు, అభిమానులు ఉత్సాహంగా జరుపుకున్నారు. కోట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జనసైనికులు వసంత్, రాజేష్, సుబ్బారావు, శేషాద్రి స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం జనసైనికుల పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన పనిని అభినందించారు. సత్యవాడ రంగా సెం టర్‌లో పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సలాది ప్రకాష్, సలాది వెర్రిబాబు, బండారు పవన్, బండారు భద్ర, సలాది చిన్న, సలాది రాముడు తదితరులు పాల్గొన్నారు.

## కేక్ కట్ చేసిన శ్రేణులు

**ఆలమూరు, (ఆంధ్రజ్యోతి):** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలో అట్టహాసంగా జరిపారు. ఆయా గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆలమూరులోని స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్య క్రమంలో కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేశారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రామానుజుల శేషగిరిరావు, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. సందిపూడి, పినపళ్ల, పెదపళ్ల, కలవచర్ల, పెనికేరు, నర్సిపూడి, చొప్పెల్ల, చెముడులంక, మడికి, బడుగువానిలంక, మూలస్థానంతోపాటు పలు గ్రామాల్లో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు.

## గ్రామస్తులకు మొక్కల పంపిణీ

**రాయవరం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా ప్రాంతాల్లో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమేశ్వరం గ్రామంలో జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు శాకా నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులకు జామ, సపోట, సీతాఫలం, మునగ, నిమ్మ తదితర మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాగేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ శాకా కోటేశ్వరరావు మణిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యువత ఆదర్శంగా తీసుకోవాలి

**కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంగర గాంధీ సెంటర్‌లో జనసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పవన్‌కల్యాణ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు ముఖ్య అతిథులను సత్కరించారు. మాచర పంచాయతీ శివారు శ్రీరామపురం, వీధివారిలంక తదితర గ్రామాల్లో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

**జనసేన పార్టీలో చేరికలు:** మండలంలోని అంగరలో 50 మంది మంగళవారం జనసేన పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ నాయకత్వాన్ని బలపరుస్తూ ఆ పార్టీలో చేరగా వారికి ఆయన పార్టీకండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి):** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఆయా ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలి, మెర్లపాలెం, లొల్ల వాడపల్లి, వెలిచేరు, వద్దిపర్రు తదితర గ్రామాల్లో పవన్ అభిమానులు కేక్‌లు కట్ చేసి జన్మదిన వేడుకలను జరిపారు. యువత బైక్ ర్యాలీ నిర్వహించి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి శ్రేణులు ఆయా గ్రామాల్లో కేక్‌లు కట్ చేశారు.



కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్లో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

## రోగులకు భోజనాలు అందజేత

**కొత్తపేట, (ఆంధ్రజ్యోతి):** పవన్ కల్యాణ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానుల ఆధ్వర్యంలో జరగ్గా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రోగులకు భోజనాలు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు పంపిణీ చేసి పారిశుధ్య కార్మికులకు భోజనాలు వడ్డించారు. ఈసందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేస్తున్న అభిమానులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, పవన్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మోకా శివ, నిమ్మకాయల చిన్నయ్యనాయుడు, చోడపనీడి శ్రీను, ముద్రగడ దుర్గాప్రసాద్, రాయి దుర్గారావు, చోడపనీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. జనసైనికుల ఆధ్వర్యంలో జరిగిన పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో జరిగిన పవన్ పుట్టినరోజు వేడుకలను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ

**మండపేట, (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుక లను నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. కూటమినేతలు, జన సైనికులు సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడు కల్లో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ పాల్గొన్నారు. పవన్ అభిమానులు, జనసైనికులు ఏర్పాటు చేసిన కేక్‌లను కట్ చేశారు. మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో వారు కేక్ కట్ చేశారు. అనంతరం వారు పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. మండలంలోని తాపేశ్వరం, ద్వారపూడి, ఏడిద, ఇప్పనపాడు, కేశవరం, పాలతోడు వెలగతోడు, మైనేతానగరం, మారేడుబాక తదితర గ్రామాల్లో జనసైనికులు, కూటమి నేతలు పవన్ జన్మదిన వేడుకలను జరిపారు.

## రక్తదానం శిబిరం

**రావులపాలెం, (ఆంధ్రజ్యోతి):** డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. రావులపాలెంలో పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ప్రారంభించి రక్తదాతలతో మాట్లాడారు. పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ముఖ్య కూడళ్ల వద్ద పవన్‌కల్యాణ్ అభిమానులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తోట స్వామి, బండారు బాబి, అంబటి కిషోర్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

# సామూహిక ఎలుకల నిర్మూలనను సద్వినియోగం చేసుకోండి



పామర్రులో రైతులతో సమావేశమైన ఏవో సద్గురుమూర్తి

కె.గంగవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నిర్వహించే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి ఏ.సద్గురుమూర్తి అన్నారు. మంగళవారం పామర్రు, యండగండి గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు గంజా హరి, శ్రీలక్ష్మి, కూటమి నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, రైతులు నున్న చంద్రబాబు, నేమాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

**రాయవరం, (ఆంధ్రజ్యోతి):** సామూహిక ఎలుకల నివారణలో భాగంగా మండలంలోని 19 రైతు సేవా కేంద్రాల ద్వారా 3న ఎలుకల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ మండల అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం రాయవరంలో ఏవో మాట్లాడుతూ రైతులంతా ఒకేసారి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా వాటి నివారణ సాధ్యమని ఏవో రైతులకు సూచించారు.



జొన్నాడకు చెందిన కరాటే-కుంగ్‌ఫూ మాస్టర్ సత్తిబాబును సత్కరిస్తున్న దృశ్యం

# సత్తిబాబుకు అవార్డు పట్ల హర్షం

ఆలమూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జొన్నాడకు చెందిన కరాటే, కుంగ్‌ఫూ మాస్టర్ కె.సత్తిబాబుకు బోదిధర్మ అవార్డుతో సత్కరించారు. విజయవాడలో జరిగిన ఐదు రాష్ట్రాల కుంగ్‌ఫూ, కరాటే మాస్టర్ల సమావేశంలో కుంగ్‌ఫూ, కరాటే, మార్షల్ ఆర్ట్స్‌కు కృషి చేస్తున్న ఆయన సేవలను గుర్తించి మార్షల్ ఆర్ట్స్ టీం బోధిధర్మ అవార్డుతో సత్కరించారు. అవార్డు స్వీకరించిన ఆయన్ను పలువురు నాయకులు తదితరులు అభినందించారు.

# వైఎస్ఆర్‌కు ఘన నివాళి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఎంపీ పిల్లి సుబాష్ చంద్రబోస్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ తదితరులు వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీలు అంబటి భవానీ, పంపన నాగమణి తదితరులు పాల్గొన్నారు.

**రావులపాలెం, (ఆంధ్రజ్యోతి):** దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పార్టీ నాయకులు, అభిమానులు జరుపుకున్నారు. రావులపాలెం వైసీపీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

**మండపేట, (ఆంధ్రజ్యోతి):** దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పట్టణంతోపాటు ఆయా ప్రాంతాల్లో మంగళవారం జరిపారు. మండపేట రాజరత్న సెంటరులో వున్న వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైసీపీ నేతలతో కలిసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ వర్ధంతిని ఆ పార్టీశ్రేణులు నిర్వహించారు.

**ఆలమూరు, (ఆంధ్రజ్యోతి):** మండలంలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. చెముడులంకలో వైసీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఆలమూరులో పార్టీ అధ్యక్షుడు రావడ సత్తిబాబు, జొన్నాడలో వైసీపీ నాయకులు దొరబాబు, నాగమోహన్‌రెడ్డి తదితరుల అధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు.

**రాయవరం, (ఆంధ్రజ్యోతి):** వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఆయన అభిమానులు, వైసీపీ నేతలు వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు.

**కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి):** కె.గంగవరంలో మంగళవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వైసీపీ నాయకులు నిర్వహించారు. స్థానిక బీసీ కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, పెట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రాభివృద్ధికి వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు మరువలేనివని వక్తలన్నారు. మంగళవారం అంగరలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసీపీ మండల అధ్యక్షులు గూటం సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, పుట్టా కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్ తదితరులతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. కపిలేశ్వరపురం, కేదార్లంక తదితర గ్రామాల్లో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు.

**ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా గ్రామాల్లో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆత్రేయపురం, ర్యాలిలో వైఎస్సార్ విగ్రహం, చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బోనం సాయిబాబా, మాజీ జడ్పీటీసీ చిలువూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల, వైస్ చైర్మన్ కరుటూరి

## లస్కర్ల వ్యవస్థను బలోపేతం చేయాలి

ఆత్రేయపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు పరిధిలోని తాత్కాలికంగా లస్కర్లను పెంచి ఇరిగేషన్ వ్యవస్థను పటిష్టం చేయాలని సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్‌లు కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నీటిపారుదల కార్యాలయంలో ఎస్ఐ గోపినాథ్‌తో సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ పరిధిలోని సమస్యలపై చర్చించారు. పంటకాలువలు, డ్రెయిన్లు పూడిక తొలగించే పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి నిధులు మంజూరుకు చర్యలు చేపట్టాలని ఎస్ఈని వారు కోరారు.

## త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కనుమూరి

ఆత్రేయపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పులిదిండి వేణుగోపాలస్వామి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ త్రిసభ్య కమిటీ మంగళవారం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. చైర్మన్‌గా కనుమూరి రామలింగరాజు, సభ్యులుగా అడపా వెంకట సత్యనారాయణ, మండేలా రాణి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనుమూరి తిరుపతిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూనంపూడి రామకృష్ణంరాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు, తోట రజని, నీటి సంఘం అధ్యక్షుడు జుజ్జవరపు హరిబాబు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, వివిధ గ్రామాల సొసైటీ చైర్మన్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు

# కొబ్బరిలో ఎన్నో ఔషధ గుణాలు

కొత్తపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొబ్బరి పంట ఆర్థికంగానే కాకుండా ఎన్నో ఔషధ గుణాలు ఇమిడి ఉన్నా యని వీకేవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. మంగళవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసంద్భంగా కొబ్బరి ఉత్పత్తులు వాటి మేలు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు జి.శ్రీనివాసులు, హేమలత, ప్రసన్నజ్యోతి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.